**రంజాన్ వేళలు**

ఇఫ్తార్(గురు) సా.6.24
సహరి(శుక్ర) ఉ.4.39

**ఎండా కాలమ్**

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రాజమండ్రి | 41.0 | 23.0 |

# గోదారి తీరాన.. ఎన్టీఆర్ కుమార్తె..




## రాజమహేంద్రవరంతో పెనవేసుకున్న అనుబంధం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజీలేని రాజకీయ చాతుర్యం.. వాగ్ధాటిలోని గాంభీర్యం.. వ్యవహారంలో చాణక్యం.. అందరినీ కలుపుకొనిపోయే మనస్తత్వం.. అన్నింటికీ మించి తెలుగువారి కీర్తిని దశదిశలా చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి.. 'తూర్పు' అడుగిడుచుగా సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంట్ బరిలో బీజేపీ తరపున అడుగుపెట్టారు. గోదావరి తీరంతో ఎన్టీఆర్‌కి ఉన్న అనుబంధం.. తూర్పుగోదావరి జిల్లాలో కమలానికి ఉన్న ఆదరణ కలగలిపి ఆమె విజయం నల్లేరుపై నడకేననే ధీమా వ్యక్తమవుతోంది.ఆ కుటుంబాన్ని వర్గవర్ణాలకు అతీతంగా అభిమానించే వాళ్లకు కొదువ లేకపోవడం.. మూడు పార్టీల పొత్తుతో వచ్చిన జోరు ఆ ధీమాకు కారణం కావచ్చు. దీంతో కులమతాలకతీతంగా గోదావరి తీరం ఎన్టీఆర్ కూతురికి స్వాగతం పలుకుతోంది.

### బలం.. బలగం..

జిల్లాలోని బీజేపీలో ఇంటిపోరు లుకలుకలు తక్కువేమీ కాదు. గతంలో రాష్ట్రాధ్యక్షుడిగా పనిచేసిన ఓ నేత అందరినీ దూరం పెట్టి తానే రాజు, తానే మంత్రి అనే చందంగా వ్యవహరించడంతో జిల్లాలోని బీజేపీలో ఏదో తెలియని నైరాశ్యం అలముకుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని పార్టీలో వర్గపోరు నెలకొంది. ఇప్పటికీ రెండు మూడు వర్గాలుగా చీలిపోయి ఎవరి తీరు వారిదే అనే చందంగా పార్టీ ఉంది. అందరినీ ఓ దారికి తీసుకురావడం ఇప్పుడు పురందేశ్వరి ముందున్న పెద్ద చాలెంజ్.. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ కుటుంబానికి అన్ని వర్గాల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉండడం ఆమెకు అధిక శాతం కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

### జిల్లాలో బీజేపీకి పట్టు..

తూర్పులో బీజేపీకి బలమైన బీజం ఉందనడంలో సందేహం లేదు. సామాజిక వర్గాల పరంగా కూడా బలం ఉంది. 1998లో గిరజాల వెంకటస్వామినాయుడు, తర్వాత ఎస్‌పీబీకే సత్యనారాయణను ఇక్కడి ప్రజలు పార్లమెంట్‌కి పంపించారు. సత్యనారాయణ కేంద్ర మంత్రిగా కూడా సేవలందించారు. 2014లో ఆకుల సత్యనారాయణ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా కమలం గుర్తుపై గెలుపొందారు.1998లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు వంటి హేమాహేమీలు వాజ్‌పేయి ప్రభుత్వ సమయంలో బీజేపీలో చేరారు. కాకినాడలో పెద్ద సంఖ్యలో కవాతు నిర్వహించారు. 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి బీజేపీ రెండు సార్లు ఎంపీలు ఢిల్లీకి వెళ్లారు. ఓసారి రాజమహేంద్రవరం నుంచి కమలం తరపున ఎమ్మెల్యే సారథ్యం వహించారు.

### తండ్రికి తగ్గ కూతురు..

పురందేశ్వరికి రాజకీయంగా తండ్రికి దగ్గ కూతురు అనే పేరుంది. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో ఎన్నో ప్రాధాన్యం ఉన్న పదవులను ఆమె కైవశం చేసుకున్నారు. ఆమె వాక్చాతుర్యం, శ్రమించే తత్వం చూసి ఆయా పార్టీల పెద్దలు కీలకమైన బాధ్యతలు అప్పగించారు. ఏ పార్టీలో ఉన్నా ఆమె తనకంటూ ఓ అస్థిరత సముపార్జించుకున్నారు. 2004లో బాపట్ల నుంచి తొలిసారి లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందారు. 2009లో విశాఖపట్నం నుంచి రెండో సారి ఎంపీగా ఎన్నికై మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో వాణిజ్యం, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. ఏపీ విభజన తర్వాత కాంగ్రెస్ తీరును వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. తొలి కేబినెట్ సమావేశాన్ని బహిష్కరించారు. 2014లో బీజేపీలో చేరారు. అనతికాలంలోనే మహిళా మోర్చా ప్రధాన ప్రభారిగా, బీజేపీ ఒడిశా ఇన్‌చార్జి, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్ తదితర హోదాల్లో పనిచేశారు. 2023 జూలై 4న ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ బీజేపీలో రాష్ట్రానికి తొలి మహిళా అధ్యక్షురాలిగా రికార్డు సాధించారు. పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు జిల్లాలో సన్నిహితులు ఉన్నారు. 1983 నుంచి 94 వరకూ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడి హోదాలో ఒంగోలు కంటే తూర్పుపైనే ఎక్కువగా దృష్టి సారించారు. 1994లో ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఎన్టీఆర్ భారీ బహిరంగ సభకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.



### గోదారోళ్లతో అనుబంధం

ఎన్‌టీఆర్ కుటుంబానికి గోదావరి జిల్లాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. నేటికీ ఎన్‌టీఆర్‌కు ఎంతో మంది అభి మానులు ఉన్నారు. టీడీపీతో కలిసి పయనిస్తున్నారు. చంద్రబాబు కుటుంబానికి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమ యంలో ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 53 రోజులు ఉన్నారు. ఆ రోజు రాత్రి ఆయనతో వచ్చిన లోకేశ్ చంద్రబాబు జైలులోకి అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో వెళ్లాక బాధాతప్త మనసుతో జైలుకు కొద్ది దూరంలో ఉన్న తాత్కాలిక నివాసానికి వెళ్లారు. మరుసటి రోజున ఎన్టీఆర్ కుమార్తె,చంద్రబాబు సతీమణి భువనే శ్వరి రాజమహేంద్రవరం చేరుకున్నారు. అప్పటి నుంచీ లోకేశ్ కోర్టు పనుల నిమిత్తం ఢిల్లీకి వెళ్లినా.. భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ఇక్కడే ఉండి కార్యకర్తలకు ధైర్యంగా నిలిచారు.స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. అలా గోదా వరి తీరంతో ఎన్టీఆర్ కుటుంబం అనుబంధం పెన వేసు కోగా..గోదారివాసులు ఆప్యాయంగా చేరదీశారు.గో దావరి వాసులకు మరింత దగ్గరయ్యేందుకు ఇప్పుడు కూ టమి తరపున పురందేశ్వరి పార్లమెంట్ బరిలో దిగుతున్నారు.

- పార్లమెంట్ అభ్యర్థిగా పురందేశ్వరి
- బీజేపీ నుంచి అవకాశం
- చిన్నమ్మకు అభిమానుల స్వాగతం
- కలిసిరానున్న మూడు పార్టీల కూటమి
- బీజేపీకి కలిసొచ్చే అంశం
- ఇప్పటికే రెండు సార్లు ఎంపీగా అనుభవం
- జిల్లాతో ఇద్దరు కుమార్తెలకు అనుబంధం
- నేడు రాజమహేంద్రవరం రాక
- ఎన్నికలకు దిశా నిర్దేశం

### ఆమె గెలిస్తే

చంద్రబాబు జైల్లో ఉండగా ఆమె గౌరవప్రదమైన పాత్ర పోషించారు. అటు కుటుంబ సభ్యురాలిగా బాధ్యత నిర్వర్తిస్తూనే ఇటు పార్టీ గీత దాటలేదు. చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టినప్పుడు లోకేశ్‌కి ఢిల్లీలో పురందేశ్వరి బాసటగా నిలిచారు. ఇప్పటికే ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో పలుకుబడి ఉంది. పలు కీలకమైన బాధ్యతలు నిర్వర్తించడంతో అత్యున్నత స్థాయి అధికారుల కార్యాలయాలతో మంచి సంబంధాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం ఎంపీగా ఆమె గెలిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధికి నిధులు సునాయాసంగా తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ ఐదేళ్లలో పారిశ్రామికంగా, పర్యాటకంగా జిల్లా వెనకడుగు వేసిందనడంలో సందేహం లేదు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అంతంత మాత్రమే. పెద్ద ప్రాజెక్టులు కూడా ఏమీ మంజూరు కాలేదు. చివరికి జిల్లా కేంద్రంలో ఉన్న హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయలేక లైట్లు పెట్టి మభ్యపెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పురందేశ్వరి ఇక్కడి నుంచి ఎంపీ అయితే రానున్న ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడం ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు ఆమె గతంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయ మంత్రిగా పని చేయడంతో యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

### నేడు రాజమహేంద్రికి పురందేశ్వరి
### ఎన్నికల కమిటీ సభ్యులతో సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి గురువారం రాజమహేంద్రవరం రానున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కమిటీ సభ్యులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశానికి పార్టీ ఇన్‌చార్జి సిద్ధార్థసింగ్, సోము వీర్రాజు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల్లో గెలుపు దిశగా పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేయనున్నారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, అంతర్గత సమస్యలు గురించి చర్చించే అవకాశం ఉంది.బీజేపీ తరపున రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా ఖరారైన తర్వాత పురందేశ్వరి తొలిసారిగా రాజమహేంద్రవరం రానుండడంతో పార్టీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం కనిపిస్తోంది.ఉదయం నరసాపురం పార్లమెంట్ స్థాయిలో జరిగే సమావేశంలో పాల్గొన్న తర్వాత రాజమహేంద్రవరంలో పాల్గొని, ఇక్కడి నుంచి అనకాపల్లిలో సమావేశానికి పురందేశ్వరి వెళ్లనున్నట్టు సమాచారం.

### ఆమెను అభిమానులే గెలిపిస్తారు..



కులమతాలకు అతీతంగా ఎన్టీఆర్ కుటుంబానికి జిల్లాలో అభిమానులున్నారు. బీజేపీలోని అన్ని హోదాల్లోని నాయకులూ కలిసికట్టుగా ఆమెను గెలిపించు కోవడా నికి సన్నద్ధంగా ఉన్నారు. వర్గాలతో ఆమెకు సంబంధం లేదు. అన్ని వర్గాల్లోనూ ఆమెను చేరదీసేవారు ఉన్నారు. అందువల్ల పురందేశ్వరిని రాజమండ్రి నుంచి పార్లమెంట్‌కి కచ్చితంగా పంపిస్తాం.

- నీరుకొండ వీరన్న చౌదరి, బీజేపీ సీనియర్ నేత



మరమ్మతులకు గురైన గామన్‌బ్రిడ్జిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత

## గామన్ వంతెనకు రెండు వారాల్లో మరమ్మతులు

- 57, 58 పిల్లర్ల వద్ద దెబ్బతిన్న వంతెన బేరింగ్‌లు
- పూనేలో డిజైనర్‌కు బేరింగ్‌లు ఆర్డర్
- ఇరువైపులా వాహన రాకపోకలకు అనుమతులు
- వంతెన పరిశీలించిన జిల్లా కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 27 : రెండు వారాల్లో గామన్ వంతెనకు మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు నుంచి కొవ్వూరు వరకూ ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానం గోదావరిపై నిర్మించిన గామన్‌బ్రిడ్జి మరమ్మతులకు గురైన ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించి మాట్లాడారు. వంతెన నిర్వహణ సంస్థ పాత్ వంతెనపై వైబ్రేషన్ ఎక్కువగా వస్తుందని గమనించిందన్నారు.పాత్ సంస్థ, ఇండిపెండెంట్ ఇంజనీర్స్, ప్రభుత్వం తరపు ఇంజనీర్లు 57, 58 పిల్లర్ల వద్ద బేరింగ్‌లు దెబ్బతినడం వల్ల వైబ్రేషన్స్ వచ్చాయని గుర్తించారన్నారు. దీనికి సంబంధించిన బేరింగ్‌లు అందుబాటులో ఉండవు. పూనేలో బేరింగ్ డిజైనర్‌ను గుర్తించి బేరింగ్‌కు ఆర్డర్ ఇచ్చారన్నారు. బేరింగ్ తయారుచేయడానికి 10 రోజులు, బేరింగ్ బ్రిడ్జికి అమర్చడానికి మరో 5 రోజులు పడుతుందన్నారు. డిజైనర్ దగ్గరకు ఇంజనీర్‌ను పంపించామని చెప్పారు. అనుకున్న సమయాని కంటే ముందుగా బేరింగ్ అమర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా తక్కువ సమయంలో మరమ్మతులు చేపట్టడానికి ఏమైనా అవకాశం ఉన్నదా పరిశీలిస్తున్నామన్నారు. వంతెనపై రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వచ్చే మార్గంలో రెండు వైపులా వాహన రాకపోకలకు అనుమతించడం జరిగిందన్నారు.ఈ మేరకు ఇంజనీర్లు నుంచి రెండు వైపులా వాహనాలు అనుమతించడానికి గల సర్టిఫికెట్‌ను పొందడం జరిగిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, ఆర్టీవో, గామన్ వంతెన నిర్వాహక సంస్థ పాత్ సంస్థ సిబ్బంది నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఇంజనీర్స్ మాట్లాడుతూ బ్రిడ్జి ప్రారంభించి పదేళ్లు దగ్గరగా వస్తుండడంతో బేరింగ్స్ దెబ్బతింటాయన్నారు. బేరింగులపై అధికంగా బరువు పడడం, పిల్లర్, స్లాబ్ కంప్రెషర్ అవ్వడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.




కొవ్వూరులో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

## ముగిసిన టెన్‌షన్

### చివరి రోజు పది పరీక్షకు 1375 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు కొద్ది రోజుల ముందే చార్జి తీసుకున్న జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ చర్యలు తీసుకున్నారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సదుపాయాలపై ఆరా తీశారు. చివరిగా సోషల్ పరీక్ష బుధవారం జరిగింది. ఈ పరీక్షకు 25,293 మంది హాజరు కావాల్సి ఉండగా 23,915 మంది హాజర య్యా రు.1375 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని డీఈవో పేర్కొన్నారు.చివరి రోజు బుధవారం పరీక్ష ముగిసిన వేళ విద్యార్థుల్లో ఉత్సాహం కనబడింది. ఒకేషనల్ విద్యకు సంబంధించిన పరీక్షలు రెండు రోజులు జరగనున్నాయి.

## గోల్డ్ స్మగ్లింగ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్న ఎంపీ భరత్‌రామ్

### కూటమి అభ్యర్థి వాసు



నరేష్‌కుమార్ జైన్‌తో కలిసి ఉన్న ఎంపీ భరత్ ఫొటో చూపిస్తున్న వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 27: ఇప్పటి వరకు బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లు, రౌడీమూకలను ప్రోత్సహించిన రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఏకంగా గోల్డ్ స్మగ్లర్లను ప్రోత్సహిస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.రాజమహేంద్రవరం జగదీశ్వరీ హోటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులకు రూ.2 కోట్ల విలువైన బంగారంతో పట్టుబడిన నరేష్‌కుమార్‌జైన్‌తో ఎంపీ భరత్‌రామ్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు.భరత్‌రామ్‌తో నరేష్‌కుమార్‌జైన్ తిరుగుతున్న ఫొటోలను చూపించారు. గతేడాది నవంబరు 4న కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారం గురించి వాకబు చేస్తే మహారాష్ట్రకు చెందిన గౌతమ్ కుమార్,ఏపీకి చెందిన నరేష్‌కుమార్‌జైన్‌లు నిందితులుగా తేల్చారని తెలిపారు. 5,198 గ్రాముల బంగారంను స్మగ్లింగ్ చేస్తుండగా కస్టమ్స్ వాళ్ళు పట్టుకున్నారని దాని విలువ సుమారు రూ.2 కోట్లు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఇలాంటి స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తులను పక్కన పెట్టుకుని తిరుగుతూ రాజమహేంద్రవరంలో స్వర్ణ వర్తక సంఘం వారి దగ్గరకు తీసుకెళ్లి భరత్‌రామ్ ప్రచారం సాగిస్తున్నారన్నారు. భరత్‌రామ్‌కు చెందిన ఐశ్వర్య జ్యూయలర్స్ వ్యాపారాన్ని మూసివేయడం చూస్తుంటే ఇలాంటి స్మగ్లింగ్ సంబంధాలు ఉన్నాయా? అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు.

# భగ్గుమన్న అనపర్తి



నల్లమిల్లి ఇంటికి చేరిన కార్యకర్తలు

- అనపర్తి సీటులో కమలం
- టీడీపీలో కట్టలు తెంచుకున్న ఆగ్రహం
- నల్లమిల్లికే కేటాయించాలని డిమాండ్
- పెట్రోల్ పోసుకుని ఇద్దరి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న నల్లమిల్లి, నాయకులు
- భారీగా రామవరం చేరుకున్న కార్యకర్తలు
- కన్నీటిపర్యంతమైన పలువురు నాయకులు
- నేడు కార్యాచరణ ప్రకటిస్తానన్న నల్లమిల్లి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనపర్తి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. అధిష్ఠానం అన్యాయం చేసిందంటూ ఆవేశంతో ఊగిపోయారు.. అనపర్తి టిక్కెట్ బీజేపీకి వెళుతుందని కొద్ది రోజులుగా ప్రచారం జరగడంతో టీడీపీ కేడర్ ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. కానీ ఈ అసమ్మతిని చల్లార్చకుండానే కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి ఎక్స్ మిలటరీ మ్యాన్ ఎం.శివరామకృష్ణంరాజు పేరును బుధవారం అధికారికంగా ప్రకటించారు. దీనిపై అనపర్తి టీడీపీ కేడర్ మండిపడింది. మొదటి జాబితాలోనే అనపర్తి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. అనంతరం బీజేపీతో కూడా కూటమికి పొత్తుకుదిరింది. ఈ నేపథ్యంలో బీజేపీ అనపర్తి సీటు కావాలని పట్టుబట్టి తీసుకుంది. ఈ విషయాన్ని సుమారు ఐదు రోజులు ముందే పసిగట్టిన రామకృష్ణారెడ్డి నాయకత్వంలోని టీడీపీ తీవ్ర ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. చాలా మంది పార్టీలకు రాజీనామాలు చేశారు. అనపర్తి టిక్కెట్ బీజేపీ అభ్యర్థికి కేటాయించినట్టు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నియోజకవర్గంలోని టీడీపీ క్యాడర్ రామకృష్ణారెడ్డి ఇంటికి వచ్చి ఆందోళనకు దిగారు. ఆయనకే సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. 1978 నుంచి ఇక్కడ రెడ్డి సామాజికవర్గమే ఏ పార్టీ నుంచైనా పోటీ చేస్తోంది. ఎమ్మెల్యేలు అవుతున్నారు. ప్రస్తుతం క్షత్రియ వర్గానికి చెందిన కృష్ణంరాజుకు ఈ సీటును బీజేపీకి ఇవ్వడంతో ఇక్కడ కూటమి అభ్యర్థి అయ్యారు. దీంతో బీజేపీ వర్గాలు, అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కానీ టీడీపీ క్యాడర్, రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రామకృష్ణారెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయమని కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. జిల్లాలో బీజేపీకి రాజమహేంద్రవరం లోక్‌సభతో పాటు అనపర్తి అసెంబ్లీ కేటాయించినట్టు అయింది. రెండు చోట్ల అభ్యర్థులను ప్రకటించారు. అధికారమే లక్ష్యంగా ముం దుకు వెళుతున్న కూటమి అనపర్తిలో ఏర్పడిన సమస్యను ఎలా అధిగమిస్తుందో మరి.

### అనపర్తి సీటు బీజేపీకే

అభ్యర్థిగా ఎక్స్ మిలట్రీ మ్యాన్ **శివరామకృష్ణంరాజు**



## రామవరంలో టీడీపీ కార్యకర్తల ఆందోళన

అనపర్తి, మార్చి 27 : అనపర్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయిస్తూ ప్రకటన రావడంతో టీడీపీ కార్యకర్తలు భారీ ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు.సీటు కేటాయింపు విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాదిగా కార్యకర్తలు రామవరంలోని టీడీపీ నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్నారు. పార్టీ తమ నాయకుడిని మోసం చేసిందంటూ ఆవేదన చెందారు. అనపర్తికి చెందిన ఇరువురు కార్యకర్తలు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రామకృష్ణారెడ్డి వారించి ఇటువంటి ప్రయత్నాలు చేయవద్దన్నారు. పలువురు కార్యకర్తలు కన్నీటి పర్యంత మయ్యారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడారు. మనం ఘోరంగా మోసపోయామని.. ఏవిధంగా అర్థం చేసుకోవాలో తెలియడంలేదన్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో వైసీపీ అన్యాయాలను అక్రమాలను ఎదురిస్తూ ప్రాణాలొడ్డి పోరాటాలు చేశామని దీనికి ఇటువంటి గౌవరం లభిస్తుందని ఊహించలేద న్నారు. తన తండ్రి మూలారెడ్డి అనారోగ్యంతో మంచాన ఉంటే కరోనాను కూడా లెక్క చేయ కుండా గ్రావెల్ కుంభకోణాన్ని బయట పెట్టానన్నారు.రాజకీయాలంటేనే ఇష్టంలేని తాను తన తండ్రి మూలారెడ్డి, అధినేత చంద్రబాబు కోరితేనే రాజకీయాల్లోకి వచ్చానని అన్నా రు. అయితే చంద్రబాబు తన విషయంలో ఎం దుకు స్పందించలేదో అర్థం కావడం లేదన్నారు. కార్యకర్తలు ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడ వద్దని గురువారం రామవరంలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై ఆలోచన చేసి నిర్ణయం తీసుకుందామన్నారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని వీడని నేతలు కూడా తనపై నమ్మకంతో టీడీపీలో చేరారని తన వెంట ఉన్న కార్యకర్తలకు తాను జవాబు దారీగా ఉంటానన్నారు.



పెట్రోల్ పోసుకున్న కార్యకర్తలను అడ్డుకుంటున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఇతర నాయకులు



### ఇది నా జీవన్మరణ సమస్య
### నేడు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

నేను మోసానికి గురయ్యా. నాకు కార్యకర్తలే ముఖ్యం.నియోజకవర్గంలోని కార్యకర్తలందరితోనూ గురువారం చర్చించి అందరికీ అవసరమయ్యేటట్టు నిర్ణయం తీసుకుంటా.. కరోనా సమయంలో కూడా టీడీపీ ఆదేశాల మేరకు తన తండ్రి ఆరోగ్యం బాగాకపోయినా ప్రజల కోసం పనిచేశా. పార్టీ నియోజకవర్గంలోనే కాకుండా ఎక్కడకు వెళ్లిపనిచేయమన్నా చేశా. అనేక వీడియో కాన్ఫరెన్స్‌లు, మీటింగ్‌లలో చంద్రబాబు తన పేరు ప్రస్తావన తెచ్చి రామకృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 181 మంది కార్యకర్తలపై కేసులు ఉన్నాయి. నాపైనా 37 కేసుల వరకూ ఉన్నాయి. నేను నా కార్యకర్తలను రక్షించుకోవాలి. దాని కోసం ఏ నిర్ణయం అవసరమైతే అదే తీసుకుంటా. ఇది నా జీవన్మరణ సమస్య.. నా కారుపైన దాడికి పాల్పడ్డారని ఇంటిపై దాడి చేశారు. నేను బతికి కార్యకర్తలను బతికించుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. కార్యకర్తలు ఆందోళన చెందవద్దు. ఆర్థికంగా బలంగా లేకపోవడమే నా బలహీనత. ఇంతవరకూ తనతో ఎవరూ కనీసం సంప్రదించలేదు.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



# రంజాన్ వేళ ఆవేదన

సీఎం జగన్.. నా మైనారిటీలు అని నోటితో అంటూనే సంక్షేమం చూడకుండా నొసటితో వెక్కిరిస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి వర్గాన్నీ మాటల గారడీతో మభ్యపెట్టినట్టే ముస్లింలను కూడా వంచన చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం లేదు. మసీదుల అభివృద్ధి పట్టదు. రంజాన్‌కు కానుక తీసేశారు. ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పడంతో అప్పు పుడితే గానీ రోజు గడవని పరిస్థితుల వల్ల చివరికి ఇమామ్ (ప్రధాన ప్రార్థనా గురువు), మౌజన్ (సహాయ ప్రార్థనా గురువు)లకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించలేని దుస్థితి దాపురించింది. దీంతో రంజాన్ వేళ ఇమామ్, మౌజన్‌లు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.


(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

- ఇమామ్, మౌజన్‌లకు 6 నెలల నుంచి భృతి లేదు
- మసీదులకు ప్రత్యేక ఆర్థిక సహాయం తీసివేత
- ముస్లింలపై వైసీపీ 'గాలి' ప్రేమ
- ఏదో చేసేస్తున్నామంటూ ఆర్భాటపు ప్రచారాలు
- క్షేత్రస్థాయిలో జరిగింది మాత్రం శూన్యం

## మమకారం గాలివాటం

వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క మసీదుకు నిధులు విడుదల జరగలేదు. గత ప్రభుత్వంలో 205 మసీదులు, 410 మంది ఇమామ్, మౌజన్‌లు ఉండగా ఐదేళ్లుగా ఈ ప్రభుత్వంలో ఒక్క అంకె వాటికి జతకాలేదు. 150 వరకూ కొత్తగా మసీదులు నిర్మించినా వాటికి ఎలాంటి సహాయమూ చేయడం లేదు. వాటిలోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ భృతి కల్పించలేదు. 2019లో రెహమత్‌నగర్‌లో రూ.90 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పటి ఎంపీ మురళీమోహన్ తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వగా.. ప్రభుత్వం రూ.65 లక్షల సమకూర్చింది. టెండరు కూడా ఖరారు అయ్యింది. తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం రావడం తెలిసిందే. దీంతో రూ.65 లక్షల నిధులూ వెనక్కి తీసేసుకున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌కి జమ చేసిన రూ.25 లక్షలు దారి మళ్లిపోయాయి. ఆ తర్వాత నాలుగేళ్ల పది నెలల వరకూ షాదీఖానా ఊసేలేదు. ముస్లింలు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా నెలన్నర ఉందనగా షాదీఖానా నిర్మిస్తామంటూ వైసీపీ నేతలు బడాయి కబుర్లు చెబుతుండడంపై ముస్లింలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఓట్లు దండుకునే ఎత్తుగడేనని ఆరోపిస్తున్నారు. ఇక, ఎడాపెడా కార్పొరేషన్ల పందేరంలో భాగంగా మైనారిటీ కార్పొరేషన్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్, నూర్ బాషా కార్పొరేషన్, సంచార ముస్లిం జాతుల కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఒక్క కార్పొరేషన్‌కీ నిధులు, విధులు లేవు. ఛైర్మన్‌లకు, డైరెక్టర్లకు కార్యాలయాల్లో కూర్చీలు కూడా లేని దుస్థితి ఉంది.

ప్రతి మసీదులో ఇమామ్, మౌజన్ ఉంటారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే తలంపుతో గత ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ భృతిని ప్రవేశపెట్టింది. ఇమామ్‌కి రూ.5 వేలు, మౌజన్‌కి రూ.3 వేలు క్రమం తప్పకుండా గౌరవ భృతి అందేది. అయితే, గత ఎన్నికల సందర్భంగా అలవికాని హామీలు వల్లె వేసిన జగన్.. ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచిపోయారు. నాలుగేళ్ల పాటు ముస్లింలు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఉద్యమం చేసిన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో ఏడాది నుంచి ఇమామ్, మౌజన్‌లకు జీతాల పెంపు జరిగింది. అయితే, ఆరు నెలల నుంచీ పెంచిన జీతాల మాట దేవుడెరుగు.. అసలు పైసా కూడా రాలేదు. దీంతో జిల్లాలోని 205 మసీదుల్లోని సుమారు 400 మంది ఇమామ్, మౌజన్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆరు నెలల నుంచీ జీతాలు రాకపోవడంతో రంజాన్ వేళ అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తోందని 'అల్లా సాక్షిగా' వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## పెంపు చూపి దగా

నాలుగేళ్లపాటు నిర్లక్ష్యం చేసి చివరి ఏడాదిలో ఎన్నికల్లో లబ్ధి లక్ష్యంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు పెంచారు. అయితే, ఆ పెంపు చూపించి సంబర పడండంటూ ఊదరగొట్టిన వైసీపీ నాయకులు.. మరోవైపు ఉపకారాలను పీకేశారు. పేద, ధనిక అనే భేదం లేకుండా రంజాన్ ఆనందంగా జరుపుకోవాలని సంకల్పించి గత ప్రభుత్వంలో రంజాన్ వచ్చిందంటే తోఫా పేరుతో కానుక అందజేసేవారు. తోఫాలో పప్పు, ఉప్పు, సేమియాలు, నెయ్యి, పసుపు వంటి ఇఫ్తార్ వంటకు అవసరమైన వస్తువులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక తోఫాను తీసేసింది. దాని స్థానంలో ప్రత్యామ్నాయం కూడా ఏమీ అందజేసే ఆలోచన చేయలేదు. అలాగే గత ప్రభుత్వంలో రంజాన్ మాసం రాక ముందే మసీదుల మరమ్మతులు, రంగులు, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం నిధులు విడుదల చేసేవాళ్లు. గ్రామాల్లోని మసీదులకు రూ.15 వేలు, పట్టణాల్లోని మసీదులకు రూ.25 వేలు అందజేసేవారు. దీంతో మసీదుల్లోని చిన్నచిన్న పనులకు ఇబ్బంది ఉండేది కాదు. వైసీపీ పాలన వచ్చిన వెంటనే ఆ ఆర్థిక సహాయానికీ నీళ్లొదిలేశారు. పెళ్లి కానుక అంటూ 'దుల్హన్' పథకాన్ని తెరపైకి తెచ్చారు. అయితే సవాలక్ష నిబంధనలు విధించి నిర్వీర్యం చేసేశారు. 10 శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదు.

### సంక్షేమాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

**షేక్ సుభాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్**



వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ముస్లిం మైనారిటీలకు ఏ రకమైనా ఆర్థిక సహాయమూ అందడం లేదు. సంక్షేమాన్నీ పట్టించుకోవడం లేదు. ఆర్థిక అభివృద్ధి ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. ఇమామ్, మౌజన్‌లకు కూడా జీతాలు సవ్యంగా ఇవ్వలేకపోతున్నారు. రంజాన్ వేళ ఇది చాలా బాధాకరమైన విషయం. ఏదొక పథకం పెట్టి ఎన్నో నిబంధనలు విధించి ఆవేదనకు గురి చేస్తున్నారు. చివరికి బరియల్ గ్రౌండ్స్‌కి ప్రహరీలకు కూడా నిధులు లేవు. గత ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం బాగా జరిగింది. మసీదుల అభివృద్ధి శరవేగంగా జరిగింది.



సుమ రిఫైనరీస్ నుంచి కమ్ముకున్న పొగలు


## సుమ రిఫైనరీస్‌లో మంటలు

**చుట్టుపక్కల ఫ్యాక్టరీల సిబ్బంది, చక్రద్వారబంధం గ్రామస్థులు పరుగులు**



రాజానగరం, మార్చి 27: మండలంలో చక్రద్వారబంధంలోని సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో బుధవారం మంటలు వ్యాపించడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోయారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడిన దట్టమైన పొగల సెగలు చక్రద్వార బంధం గ్రామాన్ని కమ్మేశాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలోని పలు ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులతో పాటుగా పరుగులు తీశారు. చక్రద్వారబంధం గ్రామంలో గత 13 ఏళ్లుగా సుమ ఆయిల్ రిఫైనరీస్ ఫ్యాక్టరీ నడుస్తోంది. అనివార్య కారణాలతో గత ఏడాది కాలంగా మూతపడటంతో ఫ్యాక్టరీని నమ్ముకున్న కొంత మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు బుధవారం ఫ్యాక్టరీలోని ఒక యంత్ర పరికరానికి వెల్డింగ్ చేస్తుండగా బాయిలర్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న సంబంధిత యజమాని అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అప్పటికే ఆకాశాన్ని అంటే రీతిలో మంటలు వ్యాపించి పరిసర గ్రామాలైన రాధేయపాలెం, కానవరం, ఫరిజల్లిపేట, రాజానగరం ప్రాంతాలకు దట్టమైన పొగలు విస్తరించడంతో ఎక్కడ ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం, ఇన్నీస్‌పేట, అనపర్తి ప్రాంతాల నుంచి వచ్చిన మూడు అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని, రూ.35 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఏడీఏ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

## వెండి ధ్వజస్తంభానికి కళా ప్రకర్షణ



అన్నవరం, మార్చి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయంలో ప్రస్తుతమున్న వెండి ధ్వజస్తంభానికి గురువారం కళా ప్రకర్షణ గావించనున్నారు. ఈ ధ్వజస్తంభం లోపల కర్ర పుచ్చిపోయి శిథిలస్థితికి చేరడంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని గత ఈవో చంద్రశేఖర ఆజాద్ సంకల్పించారు. అయితే దీనిని సుమారు రూ.3.50 కోట్లతో బంగారంతో తయారు చేసేందుకు నెల్లూరుకు చెందిన ఒకదాత ముందుకొచ్చారు. బంగారు ధ్వజస్తంభం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళా ప్రకర్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం నుంచి పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటుగా హోమాలను చేపట్టి శాస్త్రోక్తంగా వెండి ధ్వజ స్తంభం బయటకు తీయనున్నారు. బంగారు ధ్వజ స్తంభ వం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభించి 22న ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ పండితులు తెలిపారు. 1500 వ్రత మండపంలో కార్యక్రమాలు చేయాల్సి ఉన్నందున గురువారం 1500 వ్రతం టికెట్ల విక్రయాలు నిలుపుదల చేయాలని నిర్ణయించారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, మార్చి 27: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ 1,01,000 విరాళంగా సమర్పించారు. మండపేటకు చెందిన సంకా శ్రీనివాస రంగారావు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా ఆయన దాతను అభినందించి అంతరాలయ దర్శనం, ప్రసాదాలు అందజేశారు.

## బీడు బారిన వరిచేలు

**బైక్‌లు నడిపి రైతుల వినూత్న నిరసన**



తాళ్లరేవు, మార్చి 27: 15 రోజులుగా సాగునీరు లేక వరిచేలు ఎండిపోతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు వరిచేలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో పంట చేల్లో మోటారుసైకిల్‌పై రైతులు ప్రదర్శన చేసి నిరసన తెలియజేశారు. ఈ ప్రాంతం నుంచి ఓఎన్‌జీసీ కంపెనీకు పైపులైను ద్వారా సాగునీరు సరఫరా అవుతున్నా పంటకాలువ ద్వారా సాగునీరు పారక కాలువలు, పంటచేలు ఎండిపోతున్నాయి. సాగునీరు సరఫరా చేయకుంటే పంట దశకు వచ్చిన చేలు దెబ్బతిని రైతులు నష్టపోతారని సుమారు 40 మంది రైతులు మంగళవారం జిల్లా కలెక్టరును స్వయంగా కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు రైతులు ఇరిగేషన్ అధికారుల రాక కోసం ఎదురుచూస్తూ వారు రాకపోవడంతో బీటలు వారిన పొలంలో బైక్ నడుపుతూ నిరసన తెలిపారు. చింతతిప్ప, పెదమాడికాపులు ప్రాంతంలో సుమారు 150 ఎకరాల్లో పంట ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందారు. వంతుల వారీ విధానం శివారుకు వచ్చేసరికి వంతు సమయం అయిపోయి పూర్తిస్థాయిలో సాగునీరు అందక పంటచేలు భూమి ఎండిపోయి బీటలు తీస్తున్నాయన్నారు. ఓఎన్‌జీసీ పైపులైను ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు సరఫరాచేసిన ఎండిన చేలు పనిచేయవని ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ రాయితీను అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొంటున్నారు.

## జిల్లాలో డ్రెడ్జింగ్‌కు అనుమతి లేదు

**'తూర్పు' కలెక్టర్ మాధవీలత**

కొవ్వూరు, మార్చి 27: తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. బుధవారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించడానికి వచ్చినఆమె విలేకర్లతో మాట్లాడారు. గోదావరి వంతెనల దగ్గర నుంచి 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు, లిఫ్టింగ్ చేయరాదని ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. పడవలపై మాన్యువల్‌గా బోట్‌మేన్ సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి డ్రెడ్జింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్, ఏఈఈ బి.ఏ. వర్మ, తహసీల్దార్ కె.మస్తాన్ పాల్గొన్నారు.

## 1న బీఈడీలో స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, మార్చి 27: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో బీఈడీ ప్రవేశాలకు ఏప్రిల్ 1వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ బుధవారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కాల వ్యవధి కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరుకావాలన్నారు. రెగ్యులర్ సీట్లు 14, ఈడబ్ల్యూఎస్ 5 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. తప్పనిసరిగా బీఈడీ ఎడ్‌సెట్ 2023 ప్రవేశ పరీక్షకు హాజరై ఉండాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఏప్రిల్ 1న ఉదయం 9 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్లు డి.జ్యో తిర్మయి, 7093008473 లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్ర దించాలన్నారు.

## విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

సామర్లకోట, మార్చి 27: సామర్లకోట పట్టణ పరిధిలో ఈటీసీ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి రంగులు వేస్తున్న పెయింటర్ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ముకుందవరం గ్రామానికి చెందిన పెయింటర్ బుల్లివీర్రాజు(22) రోజూలాగే పెయింటింగ్ పనులు చేస్తుండగా సమీపంలోని 11 కెవీఏ విద్యుత్ లైన్లు చూడకుండా పెయింటింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగి విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలో ఉన్న పలువురు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే బులివీర్రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలబాలాజీ ఆదాయం రూ.27.67 లక్షలు

మామిడికుదురు, మార్చి 27: మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి హుండీల ఆదాయం రూ.27,67,808 వచ్చినట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. అమలాపురం దేవదాయశాఖ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో 54 రోజులకు గాను హుండీ లెక్కింపు నిర్వహించారు. 10.300 గ్రాముల బంగారం, కిలో 150 గ్రాముల వెండి వచ్చినట్టు సహాయ కమిషనర్ తెలిపారు.



## ఆకట్టుకున్న నావికాదళ విన్యాసాలు



యుద్ధ నౌకల నుంచి దాడులకు సిద్ధమవుతున్న సైన్యం



సర్పవరం జంక్షన్, మార్చి 27 : ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంప్ విన్యాసాలు బుధవారం కాకినాడ సాగరతీరంలో ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, అమెరికా (యూఎస్) యాంఫిబియస్ విన్యాసాల్లో భాగంగా నావెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా ఎక్స్ టైగర్ ట్రంప్-2024 సీ ఫేజ్‌లో భాగంగా నిర్వహిస్తోన్న సైనిక విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సముద్ర తీరంలో యుద్ధం, తుపాన్లు, విపత్తు, ఆపద సమయాల్లో సముద్రం, ఆకాశయానం నుంచి ఏ విధంగా సహాయ చర్యలు అందిస్తారు, యుద్ధ సమయంలో శత్రు దేశాలపై త్రివిధ దళాలు నిర్వహించే ఎదురుదాడి తదితర వాటిపై ఇరుదేశాల సైనికులు విన్యాసాల్లో పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించారు. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్ర మార్గంలో త్రివిధ దళాలు జరిపే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు అబ్బురపరిచాయి. బహుళ డ్రోన్ల, యాంటీ డ్రోన్ పరికరాలే కాకుండా అత్యాధునిక యుద్ధ పరికరాలతో సామర్థ్యాలను పరీక్షించారు. ఈ విన్యాసాల్లో భారత్, యూఎస్ దళాల క్రాస్ బోర్డర్ల సందర్శనలు, సైనికుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఉమ్మడి శిక్షణ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విన్యాసాల్లో సుమారు 700 మంది ఆర్మీ, నేవీల త్రివిధ దళాలకు చెందిన సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. జాయింట్ ఎక్సర్‌సైజులో పాల్గొనేందుకు అమెరికా నుంచి వచ్చిన యుద్ధ విమానాలతో పాటు ఇండియాకు చెందిన విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం నుంచి ఈనెల 30 వరకు ఎక్స్ టైగర్ ట్రంప్ విన్యాసాలు నిర్వహించనున్నామని, బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్లు కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు

**ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం.. మాజీ సైనికుడికి అవకాశం**



అనపర్తి, మార్చి 27 : అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ తరపున బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ములగపాటి శివరామకృష్ణంరాజు పేరును ఖరారు చేశారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర పార్టీ ఓ నోట్‌ను విడుదల చేసింది. వారం పది రోజులుగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిత్వం టీడీపీకా బీజేపీకా అంటూ తీవ్ర చర్చ నడిచింది. అనపర్తి సీటుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ సందిగ్ధతకు తెరదించుకూ బీజేపీ అధిష్ఠానం పది సీట్లలోను అనపర్తి సీటుకు బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ములగపాటి రామరాజు ఏకైక కుమారుడు శివరామకృష్ణంరాజు ఉన్నత విద్యావంతుడు. తండ్రి రామరాజు 1982 నుంచి బీజేపీలో కొనసాగుతూ అనేక పదవులను నిర్వహించారు. దేశభక్తి కలిగిన శివరామకృష్ణంరాజు సుమారు 16 సంవత్సరాల క్రితం మిలటరీలో చేరి తొమ్మిది రాష్ట్రాలలో మిలటరీ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. తండ్రి ఆరోగ్య పరిస్థితుల రీత్యా ఆయన గత రెండు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం ఆర్ఎస్ఎస్‌లో ప్రచార ప్రముఖ్‌గా చేరి అనంతరం బీజేపీలో మండల అధ్యక్షుడిగా సేవలందించి జిల్లా మీడియా ప్యానలిస్ట్‌గా ఎదిగి రెండు సంవత్సరాలుగా అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాగస్వామ్య పార్టీలైన టీడీపీ జనసేన పార్టీలను కలుపుకుంటూ విజయం దిశగా పయనిస్తానని చెప్పారు.

## నిందితుల హక్కులను గౌరవించాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ) ప్రత్యూషకుమారి**

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలను కచ్చితంగా అతడికి, కుటుంబీకులకు చట్ట ప్రకారం తెలియజేయాలని.. అతడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏలో ప్రీ-అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం, ఆంధ్రప్రదేశ్ బాధితులకు పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల్లోని బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో న్యాయవాదిని కలిసే హక్కు ఉందన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని పక్షంలో డీఎల్ఎస్ఏ ద్వారా నిబంధనలు అనుసరించి ఉచిత న్యాయ సేవలు పొందే హక్కు ఉందన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరుపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లతో చర్చించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోని తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల విషయంలో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలు, పిల్లలకు శిశు గృహ, బాల సదనాలు, సంక్షేమ వసతి గృహాలు తదితర సేవల గురించి ఆ శాఖ అధికారిణి కె.విజయకుమారి వివరించారు.

## 'తూర్పు' ఎస్పీ జగదీశ్‌కు డీజీపీ కమెండేషన్ డిస్క్ అవార్డు



రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో ప్రతిభ చూపినందుకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌కు రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారం లభించింది. డీజీపీ కమెండేషన్ డిస్క్-2022 అవార్డులను ప్రకటిస్తూ ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయి అధికారుల విభాగంలో తూర్పు ఎస్పీ పి.జగదీశ్, సిబ్బంది విభాగంలో వన్‌టౌన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.సత్యానందం సిల్వర్ డిస్క్‌లు కైవసం చేసుకున్నారు. ఎస్పీకి గతేడాది కూడా సిల్వర్ డిస్క్ లభించడం గమనార్హం. జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, హెచ్‌సీలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, కె.గోవర్ధనవరప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు ఎల్.ప్రమీల, వి.దీనాకుమారి, కాని స్టేబుల్ డి.దుర్గాప్రసాద్, ప్రభుత్వ రైల్వే పోలీసు కానిస్టేబుల్ సీహెచ్ గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ విభాగంలో తూర్పు గోదావరి జోన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ ఎం.భాస్క రరావు బ్రాంజ్ డిస్క్‌లకు ఎంపికయ్యారు.

## జేఎన్టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్



ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మార్చి 27: కాకినాడ జేఎన్టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖలోని నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, అక్నూ ఉపకులపతి కె.పద్మరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ కన్వీనర్‌గానూ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కళ్యాణ మనోహర్ సమన్వయకర్తగానూ వ్యవహరించారు. విద్యార్థులు రూపొందించిన సృజనాత్మకమైన పరికరాలను ప్రదర్శించారు. వీసీలు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. అనంతరం వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి ఇన్నోవేషన్ ఫెయిర్ ద్వారా పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 200 పైగా నమూనాలను ప్రదర్శించినట్లు డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. అత్యుత్తమమైన నమూనాలకు నగదు బహుమతిని అందజేయనున్నామన్నారు. డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ సమాచారం

## దివ్యాంగుల ఓటు హక్కు వినియోగానికి ప్రత్యేక సదుపాయాలు



అవగాహన కల్పిస్తున్న రహీం

రంపచోడవరం, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించిందని అల్లూరి సీతారామరాజు జిల్లా దివ్యాంగుల నోడల్ అధికారి ఎం.ఎ.రహీం తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐటీడీఏ పరిపాలనాధికారి డీఎన్వీ రమణ, సీడీపీవో సంధ్యారాణి, డీటీలు ఎన్వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఇందిరాబాయి పాల్గొన్నారు.

## ఏజెన్సీలో మలేరియా నిర్మూలనకు చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, మార్చి 27: ఏజెన్సీలో మలేరియాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఇంట్లో మలేరియా దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించనున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయ చాంబరులో మలేరియా శాఖ, సబ్ యూనిట్ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 15 నుంచి స్ప్రేయింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మలేరియా లక్షణాలు ఉన్న వారికి కిట్లు అందించాలన్నారు. పీహెచ్‌సీలలో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీలలో నమోదైన మలేరియా కేసులపై సమీక్షించారు. ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, మలేరియా ఏఎంవో నక్కా వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఎస్‌వో టి.మార్తమ్మ, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని కుటుంబానికి పరామర్శ

కూనవరం,మార్చి27: ఉపాధ్యాయుడు సాంబయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష బుధవారం పరామర్శించారు. సాంబయ్య కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. సాంబయ్య భార్య సోయం లక్ష్మి గతంలో టీడీపీ సర్పంచ్‌గా పనిచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, సీనియర్ నాయకులు ఇంటి భాస్కరరావు, నోముల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేశుల రంజిత్‌కుమార్, జి.రామారావు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## 'రంప ఎమ్మెల్యే టికెట్ మార్చాలి'

వై.రామవరం,మార్చి27: అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్‌ను మార్చి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి కేటాయించాలని ఆ పార్టీ కార్యకర్తలు అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. వై.రామవరం మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి వీకా నరసన్నదొర ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం చవిటిదిబ్బలులో సమావేశమయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా పార్టీ కోసం రాజేశ్వరి ఎంతో కష్టపడ్డారని ఎవరి సలహా తీసుకోకుండా ఎవరో తెలియని వారికి టిక్కెట్ ఇవ్వడమేమిటని వారు అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఇప్పుడు టిక్కెట్ మార్చకపోతే ఓటమి తప్పదని వారు హెచ్చరించారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి కురుసం సత్యనారాయణదొర, మహిళా అధ్యక్షురాలు పీరు వాణి, సీనియర్ నాయకుడు కురుసం బాబూరావు, జర్తా వీర్రాజు, మండల కార్యదర్శి యాట్ల వెంకటరమణారెడ్డి, బూత్ ఇన్‌చార్జిలు కోసూరి శ్రీనివాస్, కీకూరి తమ్మిరెడ్డి, కురుసం రాజబాబు, యాట్ల సత్తిరెడ్డి, ఆర్.సత్యవతి, వీకా పండుదొర పాల్గొన్నారు.

## 'బస్ పాస్‌లలో ఎస్కార్ట్‌ను ఇస్తున్నాం'

వై.రామవరం,మార్చి27: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే బస్‌పాస్‌లు ఉన్న అంధులైన దివ్యాంగులకు ఎస్కార్ట్ ఇస్తున్నామని పాస్ హోల్డర్‌కు హాఫ్ టిక్కెట్, సహాయకుడికి హాఫ్ చార్జీతో టిక్కెట్ ఇస్తున్నామని ఇది ఎప్పటి నుంచో అమలులో ఉందని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. వై.రామవరం నుంచి ఏలేశ్వరం వరకు ఉదయం 7.45కు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో నూరుశాతం అంధురాలైన ఓ దివ్యాంగురాలుకు కండక్టర్ ఎస్కార్ట్ ఇవ్వకుండా ఒక హాఫ్ టిక్కెట్ మాత్రమే ఇవ్వడంతో ఆ అంధురాలు తీవ్ర ఆవేదనకు గురైంది. తాను 25 సంవత్సరాలుగా బస్‌పాస్‌పై ప్రయాణిస్తున్నానని ప్రతీసారి ఎస్కార్ట్ ఇస్తున్నారని తెలిపారు. ఎస్కార్ట్ ఇవ్వకపోతే అంధురాలైన తాను ఎలా ప్రయాణించగలనని ఆమె ప్రశ్నించింది. ఆర్టీసీ అధికారులే దివ్యాంగుల బస్సుపాస్‌లపై ఎస్కార్ట్ విధానాన్ని రద్దు చేశారని ఆ కండక్టర్ తనతో వాదనకు దిగాడని వాపోయింది. డిపో మేనేజర్ మాట్లాడుతూ వైకల్య శాతం ఆధారంగా ఎస్కార్ట్ ఇస్తున్నామని తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

మోతుగూడెం, మార్చి 27: చింతూరు మండలం మోతుగూడెం డీఏవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో పూర్తయ్యాయి. పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పూర్తి చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ టి.ఆదయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ కె.నాగరాజు మోతుగూడెం పోలీస్ ఎస్ఐ జి.గోపాలరావు పర్యవేక్షణలో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ముగిశాయి.

## ముగిసిన పది పరీక్షలు

వరరామచంద్రాపురం, మార్చి 27: ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. గురువారం వీఆర్‌పురం పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు.

## 'ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి'

ఎటపాక, మార్చి 27: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపునకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ నాయకులు మాచినేని రాజేష్, జనసేన మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్, బీజేపీ మండలాధ్యక్షుడు మోదుగు పెరమయ్య అన్నారు. సీతాపురం గ్రామంలో బుధవారం ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రంపచోడవరం ఎన్డీఏ కూటమి అభ్యర్థిని మిరియాల శిరీషాదేవి, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలన్నారు. నాయకులు బొల్లా ప్రసాద్, ఏలూరి వెంకటేశ్వరరావు, బొల్లా రమేష్, చింతా దుర్గారావు, మల్లాడి రాము, రెడ్డి రామకృష్ణ, జయమ్మ పాల్గొన్నారు.

## గంజాయితో వ్యక్తి అరెస్టు

దేవిపట్నం,మార్చి 27: పోతవరం గ్రామ శివారున పోతవరం నుంచి దండంగి వెళ్లే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్‌కుమార్ సింగ్ 500 గ్రాములు గంజాయి కలిగి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

## బీజేపీలో నరేష్‌కుమార్ యాదవ్ చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : వైసీపీ నగర యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్ తన అనుచరులతో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దత్తు మాట్లాడుతూ యువకుడైన నరేష్‌కుమార్ యాదవ్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, కురగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి విజయానికి సైనికుల్లా పనిచేయాలి



బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

● బూత్ కన్వీనర్ల సమావేశంలో టీడీపీ నేతలు

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 27: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. హోటల్ జగదీశ్వరిలో టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణి అధ్యక్షతన బుధవారం జరిగిన బూత్ కన్వీనర్ల సమావేశంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఎటువంటి రాగద్వేషాలకు వెళ్లకుండా వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ 85శాతం హామీలను ఎగ్గొట్టి ఏపీ ప్రజలను మోసం చేసినందుకే వైసీపీని ఓడించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీ పేరుతో హామీ ఇచ్చి దగా చేశా రని, 2,30,000 ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పారని మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారని, జాబ్ కాలెండర్ అని హామీకి విరుద్ధంగా వ్యవహరించాడని, ఇసుక రేట్లు నాలుగు రెట్లు పెంచి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతీశాడని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలను నాశనం చేశాడన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని ఏ ఒకటి పూర్తిచేయలేదని అందుకే వైసీపీని ఓడించాలని పిలుపు నిచ్చారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు వాసిరెడ్డి రాంబాబు, కాశి నవీన్‌కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

### 25 శాతం కమీషన్ కోసమే భరత్ పనులు : వాసు

ఎంపీ మార్గాని భరత్‌రామ్ 25 శాతం కమీషన్ కోసమే నగరంలో హడావిడి పనులు చేశారని, కమీషన్ల కోసం ఏకంగా అల్టిమేటం జారీ చేశారని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక 21వ డివిజన్‌లో బుధవారం జరిగిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల్లో రాజమండ్రి ప్రజలు ఎంపీ భరత్‌రామ్‌ను తిరస్కరించారని, ఇపుడు కూడా ఇతను చేసిన పనుల పట్ల ప్రజలు నమ్మకంగా లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసి నగర అధ్యక్షుడు నల్లం శ్రీను, మాజీ కార్పొరేటర్ కొమ్మ శ్రీనివాస్, నగర ట్రేడర్ సెల్ ప్రధాన కార్యదర్శి నిమ్మలపూడి గోవింద్, నాయకులు వెలమదుర్గాప్రసాద్, కొమ్మ రమేష్, సతీష్ నాయకులు పాల్గొన్నారు.

### భరత్ రామ్ 25 పర్సంటేజ్ స్టార్

● టీడీపీ,జనసేన, బీజేపీ మహిళలు

ఇంతకాలం రీల్స్ స్టార్‌గా ఉన్న రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరంలో 25 శాతం కమీషన్ కోసం హడావుడి పనులు చేసి పర్సంటేజ్ స్టార్ బిరుదు సాధించారని టీడీపీ,జనసేన, బీజేపీ మహిళలు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో తెలుగు మహిళ పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, జనసేన వీర మహిళా కమిటి నగర కార్యదర్శి ముమ్మిడి భాగ్యలక్ష్మి, బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అనురాధ మాట్లాడారు. ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులకు దూరంగా ఉండి చివర నిమిషంలో ఎన్నికల కోడ్ వచ్చే ముందు పనులకు శంకుస్థాపనలు ఎందుకు చేశావు భరత్ అని ప్రశ్నించారు. రూ.150 రూపాయల చీర మహిళలకు పంచి ఓట్లుకు గేలం వేద్దామనుకున్నావా అని మండిపడ్డారు. ఇటీవల నగరంలో పంచిన ఇళ్ళ పట్టాలు బోగస్ పట్టాలన్నారు. అన్ని విధాలా రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి చేస్తే జగన్ సర్వనాశనం చేశాడన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను విమర్శించే స్థాయి భరత్ రామ్‌కు లేదన్నారు. కూటమి అధికారంలోకి రాబోతుందని ప్రజలందరికి న్యాయం జరుగుతుందన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల బలరామకృష్ణ

## విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

● టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బీవీఆర్, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల

కోరుకొండ, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి రాజానగరం నియోజకవర్గంలో విజయమే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధురపూడి, నిడిగట్ల, బుచ్చింపేట, గుమ్ములూరు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ప్రతిఒక్కరు బత్తుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలోచంద్రబాబు నాయుడు సారథ్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకిరావాలన్నారు. అదే విధంగా రాజమండ్రి పార్లమెంట్ నుంచి ఉమ్మడి అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణకు అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, రొంగల శ్రీనివాస్, అడపా వీరబాబు, జనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, బదిరెడ్డి దొర, మాజీ ఎంపీపీ బుద్దా బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

## అనపర్తి ఎమ్మెల్యే టిక్కెట్ టీడీపీకే ఇవ్వాలి

● మోకాళ్లపై నిలబడి టీడీపీ నాయకుల నిరసన

రంగంపేట, మార్చి 27 : అనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే టికె ట్ టీడీపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డినే కొనసాగించాలని కోరుతూ బుధవారం రంగంపేట మండలం రంగంపేటలో నాయకులు ఆళ్ళ గోవింద్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ పాదయాత్ర చేసి అనంతరం ఏడీబీ రోడ్డుపై మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రంగంపేట గ్రామ, మండల నాయకులు ఆళ్ళ గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, అడబాల వెంకటరావు, పూసల శ్రీనివాస్, ఉద్దండ్రావు శ్రీను, బలిరెడ్డి దుర్గారావు, దూళ్ళ ధర్మరాజు, పోతుల సత్తిబాబు, రాంబాబు, అమ్మిరాజు, ఆచంట వెంకటేశ్, మాచిన వెంకన్నదొర, నాయకులు పాల్గొన్నారు.



రంగంపేట ఏడీబీ రోడ్‌పై మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

## త్యాగరాజ సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 27: శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 9వ రోజు బుధవారం ముప్పవరపు సింహాచల శాస్త్రి భాగవతార్ హరికథా గానంచేశారు. పాలపర్తి ఆంజనేయులు (వయోలిన్), బుద్ధవరపు మారుతీ రఘురామ్ (మృదంగం) బృందం సహకారంతో హరికథా గానం సాగింది. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## శతావధాని తాతా సందీప్ శర్మ భాగవత ప్రవచనం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి27: అహంకారమే పతనానికి కారణమని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. మెయిన్ రోడ్డులో షిరిడి సాయి మందిరంలో జరుగుతున్న ద్వాదశ కుంభా భిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం భాగవతంలోని అష్టమ స్కంధంలో వామన చరిత్ర గురించి వివరించారు. పద్యాలు రమణీ యంగా తెలుగుభాషా వైభవాన్ని,భక్తి భావాన్ని చాటి చెబుతాయని అన్నారు.అనంతరం కె.కార్తికేయ కీబోర్డు, వారణాసి శ్రీకృష్ణరాఘవ వయోలిన్ కచేరీ శ్రోతలను అలరించాయి.

# సాంఘిక రుగ్మతల ప్రతిఘటనకు సరైన వేదిక రంగస్థలమే

● నన్నయ తెలుగు ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : సాంఘిక నాటకాలకు ఆద్యుడైన కందుకూరి వీరేశలింగం నాటకాలు సమాజంలో ఎంతో మార్పును తీసుకొచ్చాయని, సమాజంలో నెలకొన్న సాంఘిక రుగ్మతల ప్రతిఘటనకు సరైన వేదిక రంగస్థలమేనని నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళా గౌతమి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాటకాల ద్వారానే సమాజంలో సంఘసంస్కరణను, సామాజిక స్పృహను కలిగించగలిగారన్నారు. ప్రసిద్ధ రంగస్థల నటుడు వి.రాజ్‌కుమార్ ఘటోత్కచుని వేషధారణతో ఏకపాత్రాభినయం చేసి విద్యార్థులను అలరించారు. రిటైర్డు ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, తెలుగుశాఖాధిపతి వీవీబీ సంజీవరావు, కో ఆర్డినేటర్ వై.స్వర్ణశ్రీ, ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా పాల్గొన్నారు.

## ఖాళీ స్థలం పన్ను రూ 1.2 కోట్లు చెల్లింపు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 27: రాజమహేంద్రవరం కంబాలచెరువు సమీపంలోని షాడే స్కూల్ ప్రాంగణంలోని ఖాళీ స్థలానికి సంబంధించి పన్ను రూ.1.02 కోట్లను నగరపాలక సంస్థకు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహనరావు బుధవారం చెల్లించారు. నగరపాలక సంస్థకు వచ్చిన ఆయన కమిషనర్ దినేష్ కుమార్‌ను కలిసి చెక్‌ను అందించారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ షాడే స్కూల్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలానికి పన్నులను ఏఈఎల్‌సీ వారి తరఫున కిమ్స్ హాస్పిటల్ వారు చెల్లించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, కామేశ్వరి, బొల్లినేని సిబ్బంది బొల్లినేని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి హుండీ లెక్కింపు

కోరుకొండ, మార్చి27: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణమండపంవద్ద అన్నవరం దేవస్థానం డీసీ రమేష్‌బాబు ఆధ్వ ర్యంలో సిబ్బంది హుండీలు లెక్కించారు. కొండపైన, కొండ దిగువన హుండీల ద్వారా రూ.11,12,570లు ఆదాయం సమకూరింది. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,37,910లు, లడ్డు ప్రసాదాలు విక్రయాలవల్ల రూ.3,01,100, కల్యాణ టిక్కెట్లు ద్వారా రూ.2,42,172లు, కట్నకానుకల ద్వారా రూ.34,273లు, అన్నదానం విరాళాలు ద్వారా రూ31,905లు, లైసెన్స్‌షాపుల ద్వారా, జోళ్లస్టాండ్ రూ.36వేలు, తలనీలాలు ద్వారా రూ.5500లు, కొబ్బరిచెక్కలు పాట ద్వారా రూ.76,500లు, మొత్తం స్వామివారికి రూ.20,77,930లు ఆదాయం సమకూరినట్లు అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

## అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ముందుకు సాగాలి

● నన్నయ వీసీ పద్మరాజు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 27: అధ్యాపకులు నిత్యవిద్యార్థులుగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ విశ్వవిద్యాల యంలో మూడ్స్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఫర్ టీచర్స్ ప్రొఫెషనల్ గ్రోత్ అండ్ గ్లోబల్ రికగ్నిషన్ అనే అంశంపై ఎఫ్‌టీపీను బుధవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో జరి గిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ అధ్యాపకులకు కొత్త విషయాలను నేర్చుకుని విద్యార్థులకు బోధించాలనే తపన ఉండాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అధ్యాపకులకు సాం కేతిక విజ్ఞానానికి సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కల్పించేందుకు ఎఫ్.టి.పి.లు నిర్వహిస్తున్నామన్నారు. రిసోర్స్ పర్సన్‌గా జేఎన్‌టీయూకే గణితశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వి.రవీం ద్రనాధ్ మాట్లాడుతూ మూడ్స్ అనే ఆన్‌లైన్ ఫ్లాట్ ఫామ్‌ద్వారా ఆన్‌లైన్ టీచింగ్ పద్ధతులను మెరుగుపర్చు కోవచ్చునన్నారు. అధ్యాపకులకు ఆన్‌లైన్ బోధనా విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయం ట్రైనింగ్ అధికారి టి.హైమావతి తదితరులు హాజరయ్యారు.

## ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. రాజమహేంద్రవరం డిపోలో అత్యధికంగా కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబరిచిన ఇద్దరు గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం, అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వరరావు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## వందేభారత్ ఢీకొని యువకుడి దుర్మరణం

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేశవరం రైల్వే గేటు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వందే భారత్ రైలు ఢీకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు ఎస్ఐ మావుళ్లు తెలిపారు. రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటడానికి ప్రయత్నించగా దుర్ఘటన జరిగి ఉండొచ్చన్నారు. మృతుడి నలుపు, ఎర్ర రంగు గళ్ల చొక్కా, ఖాకీ రంగు నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.9491003239కి సమాచారం అందించాలని కోరారు.

## ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి: డీఎల్‌పీవో

రంగంపేట, మార్చి 27: మండలంలోని ఇంటి పన్ను వసూళ్ల శాతం తక్కువగా ఉందని వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం డివిజినల్ పంచాయతీ అధికారి హెచ్.నాగలత అన్నారు. బుధవారం ఆమె రంగంపేట మండలంలో పర్యటించి అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈనెలాఖరుకి కనీసం 90 శాతం ఇంటిపన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ప్రతి పంచాయతీలోనూ ఎన్నికల ఆదర్శ నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కుళాయి పన్నులను కూడా వసూళ్లు వేగవంతం చేసి పంచాయతీ సిబ్బందికి జీత భత్యాలు చెల్లించేందుకు గ్రామ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. రంగంపేట పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి (పీఆర్ అండ్‌ఆర్‌డీ) వెంకటరత్నం, మండలంలో గల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఆర్పీఎఫ్ పోలీసుల కవాతు

కోరుకొండ, మార్చి27: రానున్నసార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సీఆర్పీఎఫ్ పోలీసులు కోరుకొండ మండలంలో పలు గ్రామాల్లో బ్లాక్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ కోరుకొండ సీఐ అడపా నాగమురళి, ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు పలు గ్రామాల్లో కవాతు చేశారు. ఈకవాతు మండలం ప్రధాన కేంద్రమైన కోరుకొండ, కాపవరం, పశ్చిమ గోనగూడెం, జంబుపట్నం గ్రామాల్లో జరిగింది

## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

బిక్కవోలు, మార్చి 27: మండలంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 20 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. 616 మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా బిక్కవోలు సెంటర్‌లో నలుగురు, ఇళ్లపల్లిలో ముగ్గురు, బలభద్రపురంలో ఇద్దరు, పందలపాక బి సెంటర్‌లో 11 మంది హాజరుకాలేదన్నారు.

## ఓటర్లకు అవగాహన కార్యక్రమం

కడియం, మార్చి 27:కడియంలో బుధవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటూ ప్రతిజ్ఞ చేశారు.

## హెచ్‌ఎం సత్యనారాయణకు సత్కారం

బిక్కవోలు, మార్చి 27: ఈనెల 31న పదవీ విరమణ చేయబోతున్న బలభద్రపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీవీవీ. సత్యనారాయణను పందలపాక ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఇల్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సత్యనారాయణ ఉద్యోగ జీవితంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు నాగబాబు, నాయక్, యువరాజారెడ్డి, సుబ్బారెడ్డి, అంజనీకుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.



పందలపాకలో పదవీవిరమణ చేయబోయే హెచ్‌ఎం సత్యనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

## వైభవంగా పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

● హాజరైన ప్రజాప్రతినిధులు, నర్సరీ రైతులు భక్తులు

కడియం, మార్చి 27: దశాబ్దాల చరిత్ర కలిగిన కడియపులంక పల్లాలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం జరిగింది. బుధ వారం పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు, నర్సరీరైతులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం పల్లాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు చేశారు. వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు.

## ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ముసలమ్మ వారి ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

కడియం, మార్చి 27: కడియపులంక ముసలమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ముసలమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. సింహాచలం దేవస్థాన ఆస్థాన వేదపండితులచే అమ్మవారికి హోమ కార్యక్రమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నర్సరీ రైతులు, భక్తులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.24
సహరి(శుక్ర) ఉ.4.39

ఎండా కాలమ్
| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమండ్రి | 41.0 | 23.0 |

# గోదారి తీరాన.. ఎన్టీఆర్ కుమార్తె..


పురందేశ్వరితో ఎన్టీఆర్(ఫైల్)

## రాజమహేంద్రవరంతో పెనవేసుకున్న అనుబంధం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజీలేని రాజకీయ చాతుర్యం.. వాగ్ధాటిలోని గాంభీర్యం.. వ్యవహారంలో చాణక్యం.. అందరినీ కలుపుకొనిపోయే మనస్తత్వం.. అన్నింటికీ మించి తెలుగువారి కీర్తిని దశ దిశలా చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి.. 'తూర్పు' ఆడబడుచుగా సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంట్ బరిలో బీజేపీ తరపున అడుగుపెట్టారు. గోదావరి తీరంతో ఎన్టీఆర్‌కి ఉన్న అనుబంధం.. తూర్పుగోదావరి జిల్లాలో కమలానికి ఉన్న ఆదరణ కలగలిపి ఆమె విజయం నల్లేరుపై నడ కేననే ధీమా వ్యక్తమవుతోంది.ఆ కుటుంబాన్ని వర్గవర్ణాలకు అతీతంగా అభిమానించే వాళ్లకు కొదువ లేకపోవడం.. మూడు పార్టీల పొత్తుతో వచ్చిన జోరు ఆ ధీమాకు కారణం కావచ్చు. దీంతో కులమతాలకతీతంగా గోదావరి తీరం ఎన్టీఆర్ కూతురికి స్వాగతం పలుకుతోంది.

### బలం.. బలగం..

జిల్లాలోని బీజేపీలో ఇంటిపోరు లుకలుకలు తక్కువేమీ కాదు. గతంలో రాష్ట్రాధ్యక్షుడిగా పనిచేసిన ఓ నేత అం దరినీ దూరం పెట్టి తానే రాజు, తానే మంత్రి అనే చందంగా వ్యవహరించడంతో జిల్లాలోని బీజేపీలో ఏదో తెలియని నైరాశ్యం అలముకుందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని పార్టీలో వర్గపోరు నెలకొంది. ఇప్పటికీ రెండు మూడు వర్గాలుగా చీలిపోయి ఎవరి తీరు వారిదే అనే చందంగా పార్టీ ఉంది. అందరినీ ఓ దారికి తీసుకు రావడం ఇప్పుడు పురందేశ్వరి ముందున్న పెద్ద చాలెంజ్.. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ కుటుంబానికి అన్ని వర్గాల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉండడం ఆమెకు అధిక శాతం కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

### జిల్లాలో బీజేపీకి పట్టు..

తూర్పులో బీజేపీకి బలమైన బీజం ఉందనడంలో సందేహం లేదు. సామాజిక వర్గాల పరంగా కూడా బలం ఉంది. 1998లో గిరజాల వెంకటస్వామినాయుడు, తర్వాత ఎస్‌బీకే సత్యనారాయణను ఇక్కడి ప్రజలు పార్లమెంట్‌కి పంపించారు. సత్యనారాయణ కేంద్ర మంత్రిగా కూడా సేవలందించారు. 2014లో ఆకుల సత్యనారాయణ రాజమ హేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా కమలం గుర్తుపై గెలు పొందారు.1998లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు వంటి హేమాహేమీలు వాజ్‌పేయి ప్రభుత్వ సమయంలో బీజేపీలో చేరారు. కాకినాడలో పెద్ద సంఖ్యలో కవాతు నిర్వహించారు. 1984 నుంచి 2019 వరకూ జరి గిన పది లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా నుంచి బీజేపీ రెండు సార్లు ఎంపీలు ఢిల్లీకి వెళ్లారు. ఓసారి రాజమహేంద్రవరం నుంచి కమలం తరపున ఎమ్మెల్యే సారథ్యం వహించారు.

### తండ్రికి తగ్గ కూతురు..

పురందేశ్వరికి రాజకీయంగా తండ్రికి దగ్గ కూతురు అనే పేరుంది. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో ఎన్నో ప్రాధాన్యం ఉన్న పదవులను ఆమె కైవశం చేసు కున్నారు. ఆమె వాక్చాతుర్యం, శ్రమించే తత్వం చూసి ఆయా పార్టీల పెద్దలు కీలకమైన బాధ్యతలు అప్పగిం చారు. ఏ పార్టీలో ఉన్నా ఆమె తనకంటూ ఓ అస్థిరత సముపార్జించుకున్నారు. 2004లో బాపట్ల నుంచి తొలిసారి లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందారు. 2009లో విశాఖ పట్నం నుంచి రెండో సారి ఎంపీగా ఎన్నికై మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో వాణిజ్యం, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయ మంత్రిగా సేవలందిం చారు. ఏపీ విభజన తర్వాత కాంగ్రెస్ తీరును వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. తొలి కేబినెట్ సమావేశాన్ని బహిష్కరించారు. 2014లో బీజేపీలో చేరారు. అనతికాలంలోనే మహిళా మోర్చా ప్రధాన ప్రభారిగా, బీజేపీ ఒడిశా ఇన్‌చార్జి, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఇండి పెండెంట్ డైరెక్టర్ తదితర హోదాల్లో పనిచేశారు. 2023 జూలై 4న ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిం చారు. ఏపీ బీజేపీలో రాష్ట్రానికి తొలి మహిళా అధ్యక్షు రాలిగా రికార్డు సాధించారు. పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు జిల్లాలో సన్నిహితులు ఉన్నారు. 1983 నుంచి 94 వరకూ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడి హోదాలో ఒంగోలు కంటే తూర్పుపైనే ఎక్కువగా దృష్టి సారించారు. 1994లో ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఎన్టీఆర్ భారీ బహిరంగ సభకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.



### గోదారోళ్లతో అనుబంధం

ఎన్టీఆర్ కుటుంబానికి గోదావరి జిల్లాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. నేటికీ ఎన్టీఆర్‌కు ఎంతో మంది అభి మానులు ఉన్నారు. టీడీపీతో కలిసి పయనిస్తు న్నారు. చంద్రబాబు కుటుంబానికి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమ యంలో ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 53 రోజులు ఉన్నారు. ఆ రోజు రాత్రి ఆయనతో వచ్చిన లోకేశ్ చంద్రబాబు జైలులోకి అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో వెళ్లాక బాధాతప్త మనసుతో జైలుకు కొద్ది దూరంలో ఉన్న తాత్కాలిక నివాసానికి వెళ్లారు. మరుసటి రోజున ఎన్టీఆర్ కుమార్తె,చంద్రబాబు సతీమణి భువనే శ్వరి రాజమహేంద్రవరం చేరుకున్నారు. అప్పటి నుంచీ లోకేశ్ కోర్టు పనుల నిమిత్తం ఢిల్లీకి వెళ్లినా.. భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ఇక్కడే ఉండి కార్యకర్తలకు ధైర్యంగా నిలిచారు.స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. అలా గోదా వరి తీరంతో ఎన్టీఆర్ కుటుంబం అనుబంధం పెన వేసు కోగా..గోదారివాసులు ఆప్యాయంగా చేరదీశారు.గో దావరి వాసులకు మరింత దగ్గరయ్యేందుకు ఇప్పుడు కూ టమి తరపున పురందేశ్వరి పార్లమెంట్ బరిలో దిగుతున్నారు.

- పార్లమెంట్ అభ్యర్థిగా పురందేశ్వరి
- బీజేపీ నుంచి అవకాశం
- చిన్నమ్మకు అభిమానుల స్వాగతం
- కలిసిరానున్న మూడు పార్టీల కూటమి
- బీజేపీకి కలిసొచ్చే అంశం
- ఇప్పటికే రెండు సార్లు ఎంపీగా అనుభవం
- జిల్లాతో ఇద్దరు కుమార్తెలకు అనుబంధం
- నేడు రాజమహేంద్రవరం రాక
- ఎన్నికలకు దిశా నిర్దేశం

### ఆమె గెలిస్తే

చంద్రబాబు జైల్లో ఉండగా ఆమె గౌరవప్రదమైన పాత్ర పోషించారు. అటు కుటుంబ సభ్యురాలిగా బాధ్యత నిర్వ ర్తిస్తూనే ఇటు పార్టీ గీత దాటలేదు. చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టినప్పుడు లోకేశ్‌కి ఢిల్లీలో పురం దేశ్వరి బాసటగా నిలిచారు. ఇప్పటికే ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో పలుకుబడి ఉంది. పలు కీలకమైన బాధ్య తలు నిర్వర్తించడంతో అత్యున్నత స్థాయి అధికారుల కార్యాలయాలతో మంచి సంబంధాలు ఉన్నాయి. రాజమ హేంద్రవరం ఎంపీగా ఆమె గెలిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధికి నిధులు సునాయాసంగా తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ ఐదేళ్లలో పారిశ్రామికంగా, పర్యాట కంగా జిల్లా వెనకడుగు వేసిందనడంలో సందేహం లేదు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అంతంత మాత్రమే. పెద్ద ప్రాజెక్టులు కూడా ఏమీ మంజూరు కాలేదు. చివరికి జిల్లా కేంద్రంలో ఉన్న హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయలేక లైట్లు పెట్టి మభ్యపెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పురందేశ్వరి ఇక్కడి నుంచి ఎంపీ అయితే రానున్న ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకురావడం ద్వారా అభి వృద్ధిని పరుగులు పెట్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు ఆమె గతంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయ మంత్రిగా పని చేయడంతో యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

### నేడు రాజమహేంద్రికి పురందేశ్వరి
### ఎన్నికల కమిటీ సభ్యులతో సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : బీజేపీ రా ష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్య ర్థి దగ్గుబాటి పురందేశ్వరి గురువారం రాజమహేంద్రవ రం రానున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మధ్యా హ్నం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కమిటీ సభ్యు లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశా నికి పార్టీ ఇన్‌ఛార్జి సిద్ధార్థసింగ్, సోము వీర్రాజు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. ఈ సమావేశం లో ఎన్నికల్లో గెలుపు దిశగా పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేయనున్నారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, అంతర్గత సమస్యలు గురించి చర్చించే అవ కాశం ఉంది.బీజేపీ తరపున రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా ఖరారైన తర్వాత పురందేశ్వరి తొలిసారిగా రాజమహేం ద్రవరం రానుండడంతో పార్టీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సా హం కనిపిస్తోంది.ఉదయం నరసాపురం పార్లమెంట్ స్థా యిలో జరిగే సమావేశంలో పాల్గొన్న తర్వాత రాజమ హేంద్రవరంలో పాల్గొని, ఇక్కడి నుంచి అనకాపల్లిలో స మావేశానికి పురందేశ్వరి వెళ్లనున్నట్టు సమాచారం.

### ఆమెను అభిమానులే గెలిపిస్తారు..



కులమతాలకు అతీతంగా ఎన్టీఆర్ కుటుంబానికి జిల్లాలో అభిమానులు న్నారు. బీజేపీలోని అన్ని హోదాల్లోని నాయకులూ కలిసికట్టుగా ఆమెను గెలిపించు కోవడా నికి సన్నద్ధంగా ఉన్నారు. వర్గాలతో ఆమెకు సంబంధం లేదు. అన్ని వర్గాల్లోనూ ఆమెను చేరదీసేవారు ఉన్నారు. అందువల్ల పురందేశ్వరిని రాజమండ్రి నుంచి పార్లమెంట్‌కి కచ్చితంగా పంపిస్తాం.

- నీరుకొండ వీరన్న చౌదరి, బీజేపీ సీనియర్ నేత


మరమ్మతులకు గురైన గామన్‌బ్రిడ్జిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత

## గామన్ వంతెనకు రెండు వారాల్లో మరమ్మతులు

- 57, 58 పిల్లర్ల వద్ద దెబ్బతిన్న వంతెన బేరింగ్‌లు
- పూనేలో డిజైనర్‌కు బేరింగ్‌లు ఆర్డర్
- ఇరువైపులా వాహన రాకపోకలకు అనుమతులు
- వంతెన పరిశీలించిన జిల్లా కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 27 : రెండు వారాల్లో గామన్ వంతెనకు మరమ్మ తులు చేపడతామని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. తూర్పుగో దావరి జిల్లా దివాన్ చెరువు నుంచి కొవ్వూరు వరకూ ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానం గోదావరిపై నిర్మించిన గామన్‌బ్రిడ్జి మరమ్మతులకు గురైన ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించి మాట్లాడారు. వంతెన నిర్వహణ సంస్థ పాత్ వంతెనపై వైబ్రేషన్ ఎక్కువగా వస్తుం దని గమనించిందన్నారు.పాత్ సంస్థ, ఇండిపెండెంట్ ఇంజనీర్స్, ప్రభు త్వం తరపు ఇంజనీర్లు 57, 58 పిల్లర్ల వద్ద బేరింగ్‌లు దెబ్బతినడం వల్ల వైబ్రేషన్స్ వచ్చాయని గుర్తించారన్నారు. దీనికి సంబంధించిన బేరింగ్‌లు అందుబాటులో ఉండవు. పూనేలో బేరింగ్ డిజైనర్‌ను గుర్తించి బేరింగ్‌కు ఆర్డర్ ఇచ్చారన్నారు. బేరింగ్ తయారుచేయడానికి 10 రోజులు, బేరింగ్ బ్రిడ్జికి అమర్చడానికి మరో 5 రోజులు పడుతుందన్నారు. డిజైనర్ దగ్గ రకు ఇంజనీర్‌ను పంపించామని చెప్పారు. అనుకున్న సమయాని కంటే ముందుగా బేరింగ్ అమర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా తక్కువ సమయంలో మరమ్మతులు చేపట్టడానికి ఏమైనా అవకా శం ఉన్నదా పరిశీలిస్తున్నామన్నారు. వంతెనపై రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వచ్చే మార్గంలో రెండు వైపులా వాహన రాకపోకలకు అనుమ తించడం జరిగిందన్నారు.ఈ మేరకు ఇంజనీర్ల నుంచి రెండు వైపులా వాహనాలు అనుమతించడానికి గల సర్టిఫికెట్‌ను పొందడం జరిగింద న్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, ఆర్టీవో, గామన్ వంతెన నిర్వాహక సంస్థ పాత్ సంస్థ సిబ్బంది నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఇంజనీర్స్ మాట్లాడుతూ బ్రిడ్జి ప్రారంభించి పదేళ్ల దగ్గరగా వస్తుండడంతో బేరింగ్స్ దెబ్బతింటాయన్నారు. బేరింగులపై అధి కంగా బరువు పడడం, పిల్లర్, స్లాబ్ కంప్రెషర్ అవ్వడం, సాంకేతిక సమ స్యలు తలెత్తడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.



కొవ్వూరులో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

## ముగిసిన టెన్షన్

### చివరి రోజు పది పరీక్షకు 1375 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు కొద్ది రోజుల ముందే చార్జి తీసుకున్న జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు ఉన్నతాధికారుల ఆదేశా లను పాటిస్తూ చర్యలు తీసుకున్నారు.విద్యార్థులకు ఎలాంటి అసౌ క ర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సదుపాయాలపై ఆరా తీశారు. చివరిగా సోషల్ పరీక్ష బుధవారం జరిగింది. ఈ పరీక్షకు 25,293 మంది హాజరు కావాల్సి ఉండగా 23,915 మంది హాజర య్యా రు.1375 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాం ఛనీయ సంఘనలూ జరగలేదని డీఈవో పేర్కొన్నారు.చివరి రోజు బుధవారం పరీక్ష ముగిసిన వేళ విద్యార్థుల్లో ఉత్సాహం కనబడింది. ఒకేషనల్ విద్యకు సంబంధించిన పరీక్షలు రెండు రోజులు జరగనున్నాయి.

# భగ్గుమన్న అనపర్తి


నల్లమిల్లి ఇంటికి చేరిన కార్యకర్తలు

- అనపర్తి సీటులో కమలం
- టీడీపీలో కట్టలు తెంచుకున్న ఆగ్రహం
- నల్లమిల్లికే కేటాయించాలని డిమాండ్
- పెట్రోల్ పోసుకుని ఇద్దరి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న నల్లమిల్లి, నాయకులు
- భారీగా రామవరం చేరుకున్న కార్యకర్తలు
- కన్నీటిపర్యంతమైన పలువురు నాయకులు
- నేడు కార్యాచరణ ప్రకటిస్తానన్న నల్లమిల్లి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనపర్తి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు భగ్గుమ న్నారు. అధిష్ఠానం అన్యాయం చేసిందంటూ ఆవేశంతో ఊగిపోయారు.. అనపర్తి టిక్కెట్ బీజేపీకి వెళుతుందని కొద్ది రోజులుగా ప్రచారం జరగడంతో టీడీపీ కేడర్ ఆం దోళనకు దిగిన సంగతి తెలిసిందే. కానీ ఈ అసమ్మతిని చల్లార్చకుండానే కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి ఎక్స్ మిలట్రీ మ్యాన్ ఎం.శివరామకృష్ణంరాజు పేరును బుధ వారం అధికారికంగా ప్రకటించారు. దీనిపై అనపర్తి టీడీపీ కేడర్ మండిపడింది. మొదటి జాబితాలోనే అన పర్తి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. అనంతరం బీజేపీతో కూడా కూటమికి పొత్తుకుదిరింది. ఈ నేపథ్యంలో బీజేపీ అనపర్తి సీటు కావాలని పట్టుబట్టి తీసుకుంది. ఈ విషయాన్ని సుమారు ఐదు రోజులు ముందే పసిగట్టిన రామకృష్ణారెడ్డి నాయకత్వంలోని టీడీపీ తీవ్ర ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. చాలా మంది పార్టీలకు రాజీనామాలు చేశారు. అనపర్తి టిక్కెట్ బీజేపీ అభ్యర్థికి కేటాయించినట్టు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నియోజకవర్గంలోని టీడీపీ క్యాడర్ రామకృష్ణారెడ్డి ఇంటికి వచ్చి ఆందోళనకు దిగారు. ఆయనకే సీటు కేటా యించాలని డిమాండ్ చేశారు. 1978 నుంచి ఇక్కడ రెడ్డి సామాజికవర్గమే ఏ పార్టీ నుంచైనా పోటీ చేస్తోంది. ఎమ్మెల్యేలు అవుతున్నారు. ప్రస్తుతం క్షత్రియ వర్గానికి చెందిన కృష్ణంరాజుకు ఈ సీటును బీజేపీకి ఇవ్వడంతో ఇక్కడ కూటమి అభ్యర్థి అయ్యారు. దీంతో బీజేపీ వర్గాలు, అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కానీ టీడీపీ క్యాడర్, రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం గా ఉన్నారు. ఈ నేపథ్యంలో రామ కృష్ణారెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయమని కార్యకర్తలు ఒత్తిడి చేస్తు న్నట్టు సమాచారం. జిల్లాలో బీజేపీకి రాజమహేంద్రవరం లోక్‌సభతో పాటు అనపర్తి అసెంబ్లీ కేటాయించినట్టు అయింది. రెండు చోట్ల అభ్యర్థులను ప్రకటించారు. అధికారమే లక్ష్యంగా ముం దుకు వెళుతున్న కూటమి అనపర్తిలో ఏర్పడిన సమస్యను ఎలా అధిగమిస్తుందో మరి.

### అనపర్తి సీటు బీజేపీకే

అభ్యర్థిగా ఎక్స్ మిలట్రీ మ్యాన్ శివరామకృష్ణంరాజు



8

## రామవరంలో టీడీపీ కార్యకర్తల ఆందోళన

అనపర్తి, మార్చి 27 : అనపర్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయిస్తూ ప్రకటన రావడంతో టీడీపీ కార్య కర్తలు భారీ ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు.సీటు కేటాయింపు విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాదిగా కార్యకర్తలు రామవరంలోని టీడీపీ నాయకుడు నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకున్నారు. పార్టీ తమ నాయకుడిని మోసం చేసిందంటూ ఆవేదన చెం దారు. అనపర్తికి చెందిన ఇరువురు కార్యకర్తలు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశా రు. టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రామకృష్ణారెడ్డి వారించి ఇటువంటి ప్రయత్నాలు చేయవద్దన్నారు. పలువురు కార్యకర్తలు కన్నీటి పర్యంత మయ్యారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడారు. మనం ఘోరంగా మోసపోయామని.. ఏవిధం గా అర్థం చేసుకోవాలో తెలియడంలేద న్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో వైసీపీ అన్యాయాలను అక్రమా లను ఎదురిస్తూ ప్రాణాలొడ్డి పోరా టాలు చేశామని దీనికి ఇటువంటి గౌరవం లభిస్తుందని ఊహించలేద న్నా రు. తన తండ్రి మూలారెడ్డి అనారోగ్యం తో మంచాన ఉంటే కరోనాను కూడా లెక్క చేయ కుండా గ్రావెల్ కుంభకోణాన్ని బయట పెట్టానన్నారు.రాజకీయాలంటేనే ఇష్టంలేని తాను తన తండ్రి మూలారెడ్డి, అధినేత చంద్రబాబు కోరితేనే రాజకీయాల్లోకి వచ్చానని అన్నా రు. అయితే చంద్రబాబు తన విషయంలో ఎం దుకు స్పందించలేదో అర్థం కావడం లేదన్నారు. కార్యకర్తలు ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడ వద్దని గురువారం రామవరంలో సమావేశమై భవిష్యత్ కార్యా చరణపై ఆలోచన చేసి నిర్ణయం తీసుకుందామన్నారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని వీడని నేతలు కూడా తనపై నమ్మకంతో టీడీపీలో చేరారని తన వెంట ఉన్న కార్యకర్తలకు తాను జవాబు దారీగా ఉంటానన్నారు.


పెట్రోల్ పోసుకున్న కార్యకర్తలను అడ్డుకుంటున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఇతర నాయకులు



### ఇది నా జీవన్మరణ సమస్య
### నేడు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

నేను మోసానికి గురయ్యా. నాకు కార్యకర్తలే ము ఖ్యం.నియోజకవర్గంలోని కార్యకర్తలందరితోనూ గురువా రం చర్చించి అందరికీ అవసరమయ్యేటట్టు నిర్ణయం తీసుకుంటా. కరోనా సమయంలో కూడా టీడీపీ ఆదేశాల మేరకు తన తండ్రి ఆరోగ్యం బాగాకపోయినా ప్రజల కోసం పనిచేశా. పార్టీ నియోజకవర్గంలోనే కాకుండా ఎక్కడకు వెళ్లిపనిచేయమన్నా చేశా. అనేక వీడియో కాన్ఫరెన్స్‌లు, మీటింగ్‌లలో చంద్రబాబు తన పేరు ప్రస్తావన తెచ్చి రామకృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 181 మంది కార్యకర్తలపై కేసులు ఉన్నాయి. నాపైనా 37 కేసుల వరకూ ఉన్నాయి. నేను నా కార్యకర్తలను రక్షించుకోవాలి. దాని కోసం ఏ నిర్ణయం అవసరమైతే అదే తీసుకుంటా. ఇది నా జీవన్మరణ సమస్య.. నా కారుపైన దాడికి పాల్పడ్డారని ఇంటిపై దాడి చేశారు. నేను బతికి కార్యకర్తలను బతికించుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. కార్యకర్తలు ఆందోళన చెందవద్దు. ఆర్థికంగా బలంగా లేకపోవడమే నా బలహీనత. ఇంతవరకూ తనతో ఎవరూ కనీసం సంప్రదించలేదు.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

## గోల్డ్ స్మగ్లింగ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్న ఎంపీ భరత్‌రామ్

### కూటమి అభ్యర్థి వాసు


నరేష్‌కుమార్ జైన్‌తో కలిసి ఉన్న ఎంపీ భరత్ ఫొటో చూపిస్తున్న వాసు

రాజమహేంద్రవ రం సిటీ, మార్చి 27: ఇప్పటి వరకు బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లు, రౌడీమూక లను ప్రోత్సహించిన రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఏకంగా గోల్డ్ స్మగ్లర్లను ప్రోత్సహిస్తు న్నారని టీడీపీ-జనసే న-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.రాజమహేంద్ర వరం జగదీశ్వరీ హోటల్‌లో బుధవారం విలేకరులతో మా ట్లాడారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులకు రూ.2 కోట్ల విలువైన బంగా రంతో పట్టుబడిన నరేష్‌కుమార్‌జైన్‌తో ఎంపీ భరత్‌రామ్‌కు సంబం ధాలు ఉన్నాయని ఆరోపించారు.భరత్‌రామ్‌తో నరేష్‌కుమార్‌జైన్ తిరుగు తున్న ఫొటోలను చూపించారు. గతేడాది నవంబరు 4న కస్టమ్స్ అధికా రులు పట్టుకున్న బంగారం గురించి వాకబు చేస్తే మహారాష్ట్రకు చెందిన గౌతమ్ కుమార్,ఏపీకి చెందిన నరేష్‌కుమార్‌జైన్‌లు నిందితు లుగా తేల్చారని తెలిపారు. 5,198 గ్రాముల బంగారంను స్మగ్లింగ్ చేస్తుండగా కస్టమ్స్ వాళ్ళు పట్టుకున్నారని దాని విలువ సుమారు రూ.2 కోట్లు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఇలాంటి స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తులను పక్కన పెట్టుకుని తిరుగుతూ రాజమహేంద్రవరం లో స్వర్ణ వర్తక సంఘం వారి దగ్గరకు తీసుకెళ్లి భరత్‌రామ్ ప్రచారం సాగిస్తున్నారన్నారు. భరత్‌రామ్‌కు చెందిన ఐశ్వర్య జ్యూయలర్స్ వ్యాపా రాన్ని మూసివేయడం చూస్తుంటే ఇలాంటి స్మగ్లింగ్ సంబంధాలు ఉన్నాయా? అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు.



పదో తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

## ముగిసిన పదో తరగతి పరీక్షలు

● సోషల్ పరీక్షకు 70 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 27: పదో తరగతి పరీక్షలు ముగిశాయి. బుధవారం కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి సోషల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణ, మండలంలోని 8 పరీక్షా సెంటర్లలో 1317 మంది పరీక్షలు రాయాల్సివుండగా 1239 మంది హాజరయ్యారు. 70మంది గైర్హాజరైనట్లు డీవైఈవో కె. వాసుదేవరావు తెలిపారు. జడ్పీహెచ్‌ఎస్, పంగిడిలో 159కి 139, జడ్పీహెచ్‌ఎస్, కుమారదేవంలో 126కి 123, జడ్పీహెచ్‌ఎస్, వాడపల్లిలో 226కి 208, కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 225కి 217, మున్సిపల్ హైస్కూల్‌లో 182కి 168, ఏఎన్‌జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో 111కి 103, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 180కి 175, వేములూరు దీప్తి హైస్కూల్‌లో 108 మందికి 106 మంది విద్యార్థులు హాజరయ్యారు.

**తాళ్లపూడి:** మండలంలో నాలుగు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతుండగా బుధవారంతో ముగిశా యి. మండలంలోని నాలుగు కేంద్రాల్లో 734 మంది విద్యార్థు లకుగానూ 653 మంది హాజరయ్యారు. 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో సెహ్రాజీ తెలిపారు.

**దేవరపల్లి:** మండలంలోని పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని దేవరపల్లి మండల ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీవీ. అప్పారావులు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సోషల్‌స్టడీస్‌లో దేవరపల్లి మండలంలోని ఐదు సెంటర్లలోనూ 982మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సిఉండగా 908మంది విద్యార్థులు రాశారని తెలిపారు. దీనిలో రెగ్యులర్ 934మందికిగానూ 912మంది హాజరయ్యారని అన్నారు. గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 45మందికిగానూ 16మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాశారన్నారు. 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని వారు తెలిపారు.

## శారదా నివేదిత బాలవికాస భవనం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

పెరవలి, మార్చి 27: రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో కానూరులో శారదా నివేధిత బాలవికాశ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పూజ్యస్వామి పరిచేయానందజీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన ఉదాస్తనందజీ మహరాజ్, అమీరపు నటరాజన్, బాపట్లకు చెందిన కృష్ణమాచారి, హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బాలవికాస్ కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దాసరి



కుటుంబరావుకు నియామక పత్రం

గోపాలపురం, మార్చి 27: జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గోపాలపురంలోని పెద్దగూడెంనకు చెందిన దాసరి కుటుంబరావు నియమితుల య్యారు. విజయ వాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్ నియామక పత్రాన్ని జారీచేశారు. విజయవాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో కుటుంబరావు జిల్లా చైర్మన్ నియామక పత్రాన్ని రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ చేతుల మీదుగా అందుకున్నారు. తనను ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా నియమించిన కాంగ్రెస్‌పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి మరింత ఉత్సాహంతో పని చేస్తానని తనపై ఉంచిన నమ్మకంతో జిల్లా బాధ్యతలు నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు గిడిగు రుద్రరాజు, సాకే శంకర్, కొప్పుల రాజు, రాజేష్, అరెగల అరుణ, పద్మశ్రీలకు కుటుంబరావు కృతజ్ఞతలు తెలిపారు.

## అనంతపల్లిలో 108 సార్లు హనుమాన్ చాలీసా



నల్లజర్ల, మార్చి 27: అనంతపల్లి షిరిడి సాయిబాబా ఆలయం 26వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు బుధవారం ఉదయం కాకడ హారతి అనంతరం జగన్నాధపురం శ్రీసీతారామ భజన మండలి వారిచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మోడేపల్లి జానకీరాం దంపతులు పూజాధికాలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని బాబావారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం భారీ అన్నసమారాధన ఉంటుందని ప్రతి ఒక్కరూ విచ్చేయాలని ఆలయకమిటీ సభ్యులు వంకాయల వరకుమార్ పేర్కొన్నారు.

## సాయుధ బలగాల మార్చ్‌ఫాస్ట్



నిడదవోలు మండలంలో సాయుధబలగాల మార్చ్‌ఫాస్ట్

నిడదవోలు, మార్చి 27: మండలంలోని బుధవారం విజ్జేశ్వరం, గోపవరం, పందలప్రరు గ్రామాల్లో సాయుధ బలగాలతో సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవగాహన కలిగిస్తూ ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్య పరిచారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ పరమహంస, పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

తాళ్లపూడి, మార్చి 27: తాళ్లపూడి మెయిన్‌రోడ్డులో గల బస్టాండ్ సెంటర్‌లో బుధవారం న్యూ యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షుడు రజనీకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఎస్‌ఐ శ్యాంసుందర్ ప్రారంభించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులను ఎస్‌ఐ అభినందించారు. యూనియన్ అధ్యక్షుడు రజని మాట్లాడుతూ వారానిక ఒకసారి చల్లటి మజ్జిగ వంటి పానీయాలు అందిస్తామని ప్రతిరోజూ చల్లటి మంచి నీరును అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ప్రసాదు, యాళ్ళ బాబూరావు, మంగరాజు, వీరబాబు, దాస్, ప్రతాప్, రాయుడు, శ్రీను, మోషే తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్యాం సుందర్



పెరవలిలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న దుర్గేష్, బూరుగుపల్లి



మద్దూరు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే

# కూటమి జెండా ఎగరాలి

నిడదవోలు ఉమ్మడి అభ్యర్థి దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి శేషారావు

పెరవలి, మార్చి 27: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మంగళవారం అన్నవరప్పాడు, మల్లేశ్వరం, నడింపాడులో పర్యటించి జనసేన, బీజేపీ కార్యకర్తలను దుర్గేష్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడుతూ అందరూ ఐకమత్యంగా పనిచేస్తూ అధిక మెజార్టీతో తనను గెలిపించాలని దుర్గేష్ కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్నివిధాలా నాశనమైందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు అతికాల రమ్యకృష్ణమ్మ, జనసేన అభ్యర్థి పిప్పర రవి, దేవికారాణి, మాజీ ఎంపీపీ పూతినీడి మురళీకృష్ణ, పలువురు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

### దుర్గేష్‌ను గెలిపించాలి

**ఉండ్రాజవరం:** టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చివటం, కె.సావరం, పాలంగి గ్రామాల్లో శేషారావు తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యులను దుర్గేష్‌కు పరిచయ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయకత్వం అవసరమని చెప్పారు. ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని మరతి అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకత్వం రావాలని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు దుర్గేష్ వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, వీరమళ్ల బాలాజీ, కాకర్ల నాని, రాచమళ్ల శ్రీనివాసరావు, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### జగన్‌ను ఇంటికి పంపించాలి

**కొవ్వూరు:** రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపించాలని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం, పిల్లల భవిష్యత్‌కోసం సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు, టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు పాల్గొన్నారు.

అనపర్తి అసెంబ్లీ

## బీజేపీ అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు



అనపర్తి, మార్చి 27 : అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ తరపున బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ములగపాటి శివరామ కృష్ణంరాజు పేరును ఢిల్లీ బీజేపీ పెద్దలు ప్రకటించారు. వారం పదిరోజులుగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి టీడీపీకా, బీజేపీకా అంటూ సందేహాలు ఏర్పడట ంతో అనపర్తి సీటుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ సందిగ్ధతకు తెరదించుతూ బీజేపీ అదిష్ఠానం పది సీట్లలోను అనపర్తి సీటుకు బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ములగపాటి రామరాజు ఏకైక కుమారుడు శివరామ కృష్ణంరాజు ఉన్నత విద్యావంతుడు. తండ్రి రామరాజు 1982నుంచి బీజేపీలో కొనసాగుతూ అనేక పదవులను నిర్వహించారు. దేశభక్తి కలిగిన శివరామ కృష్ణంరాజు సుమారు 16సంవత్సరాల క్రితం మిలటరీలోచేరి తొమ్మిది రాష్ట్రాలలో మిలటరీ ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేశారు. తండ్రి ఆరోగ్య పరిస్థితులరీత్యా ఆయన గత రెండు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం ఆర్ఎస్ఎస్‌లో ప్రచార ప్రముఖ్‌గా చేరి అనంతరం బీజేపీలో మండల అధ్యక్షుడిగా సేవలందించి జిల్లా మీడియా ప్యానలిస్ట్‌గా ఎదిగి రెండు సంవత్సరాలుగా అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మా ట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీలను కలుపుకుంటూ విజయం దిశగా పయనిస్తానని అన్నారు.

## బహుజనవాద కవి రత్నాజీకి సత్కారం

చాగల్లు, మార్చి 27: చాగల్లుకు చెందిన బహుజనవాద కవి నేలపూరి రత్నాజీని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. బుధవారం ఆయన విలేఖరులకు తెలిపిన వివరాల ప్రకారం కవి సంధ్య, డాక్టర్ భట్టిప్రోలు దుర్గా లక్ష్మిప్రసన్న సంయుక్తంగా నిర్వహించిన స్మారక వచన కవితల పోటీలో రత్నాజీ రచించిన దుక్కి పొలం అనే వచన కవిత సంకల్పంకి తృతీయ బహుమతి లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సాహిత్య సభలో ప్రముఖ కవి కే.శివారెడ్డి, కవి సంధ్య సంచాలకుడు డాక్టర్ శిఖామణి, దాట్ల దేవదానంలు రత్నాజీని సత్కరించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ సాహితీవేత్త వాడ్రేవు వీరభద్రుడు చేతుల మీదుగా నక్క కవిత సంకనంను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రత్నాజీని స్థానిక ప్రముఖులు పలువురు అభినందించారు.

## గంజాయితో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

ఉండ్రాజవరం, మార్చి 27 : మండలంలోని పాలంగి గ్రామంలోని ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద బుధవారం గంజాయితో వెళుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వి.అప్పలరాజు తెలిపారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నడచి వస్తూ పోలీసులను చూసి కంగారుగా వెళ్లిపోతున్న సమయంలో అనుమానం వచ్చి వారిని ఆపి బ్యాగులను తనిఖీ చేశారు. రెండు ప్లాస్టిక్ కవర్లలో 11 కేజీల గంజాయిని కలిగి ఉన్నట్లు గుర్తించి కేరళ రాష్ట్రానికి చెందిన పి.రాజీవ్‌రవి, కె. సుల్ఫికర్ అనే వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అప్పలరాజు వివరించారు. వీరు కేరళ రాష్ట్రం నుంచి కాకినాడ వచ్చి జీవిస్తూ, పాడేరు నుంచి గంజాయిని తీసుకువచ్చి ఉండ్రాజవరం పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు ఎస్‌ఐ చెప్పారు.

## మద్యం బాటిల్స్ స్వాధీనం



గోపాలపురం, మార్చి 27: అక్రమ మద్యం తయారీ, తరలింపు, అనధికార విక్రయాలను ఉపేక్షించేది లేదని దేవరపల్లి సర్కిల్ సీఐ కే.బాలసురేష్‌బాబు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపుపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 30 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరుస్తామని అన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ కే.సతీష్‌కుమార్ ఉన్నారు.

## ఇసుక డ్రెడ్జింగ్‌కు అనుమతి లేదు

కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 27: తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. బుధవారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించడానికి వచ్చిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. గోదావరి వంతెనల దగ్గర నుంచి 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు, లిఫ్టింగ్ చేయరాదని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. పడవలపై మాన్యువల్‌గా బోట్‌మేన్ సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి డ్రెడ్జింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్, ఏఈఈ బి.ఎ. వర్మ, తహసీల్దార్ కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## సుమ రిఫైనరీస్‌లో మంటలు

చుట్టుపక్కల ఫ్యాక్టరీల సిబ్బంది, గ్రామస్థులు పరుగులు



రాజానగరం, మార్చి 27: మండలంలో చక్రద్వారబంధంలోని సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో బుధవారం మంటలు వ్యాపించడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోయారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడిన దట్టమైన పొగల సెగలు చక్రద్వారబంధం గ్రామాన్ని కమ్మేశాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలోని పలు ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులు పరుగులు తీశారు. చక్రద్వారబంధం గ్రామంలో గత 13 ఏళ్లుగా సుమ ఆయిల్ రిఫైనరీస్ ఫ్యాక్టరీ నడుస్తోంది. అనివార్య కారణాలతో గతేడాది కాలంగా మూతపడింది.ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు బుధవారం ఫ్యాక్టరీలోని ఒక యంత్ర పరికరానికి వెల్డింగ్ చేస్తుండగా బాయిలర్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫ్యాక్టరీ యజమాని అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అప్పటికే ఆకాశాన్ని అంటే రీతిలో మంటలు వ్యాపించి పరిసర గ్రామాలైన రాధేయపాలెం, కానవరం, ఫరిజల్లిపేట, రాజానగరం ప్రాంతాలకు దట్టమైన పొగలు విస్తరించాయి.రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం,ఇన్నీస్‌పేట, అనపర్తి ప్రాంతాల నుంచి మూడు అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని, రూ.35 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఏడీఏ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.



రైతు భరోసా కేంద్రానికి తెల్లరంగు వేస్తున్న దృశ్యం

## రంగు పడింది..


సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదుతో ఆర్‌బీకే రంగు మార్పు

తాళ్లపూడి, మార్చి 27: ఎన్నికల కమీషన్ ఏర్పాటుచేసిన సి విజిల్ యాప్ ద్వారా ఒక ఫిర్యాదు నమోదైందని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్షన్ నిబంధనలకు వ్యతిరేకంగా తుపాకులగూడెం గ్రామంలో ప్రభు త్వ కార్యాలయానికి వైసీపీ రంగులు ఉన్నాయని ఫిర్యాదు రాగా తగుచర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా కేంద్రం భవనానికి వైసీపీ రంగులు ఉన్నాయని వెంటనే గ్రామ పంచా యతీ కార్యదర్శి రామలక్ష్మితో కలిసి భవనాన్ని సందర్శించి భవనానికి తెలుపు రంగు వేశామని తెలిపారు.

## ఓటు హక్కుపై అవగాహన

కొవ్వూరు, మార్చి 27 : కొవ్వూరు పట్టణంలోని 14వ వార్డులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నూతన ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. బుధవారం జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయ మేనేజర్ పోలిశెట్టి శివ ఇం టిం టికీ వెళ్లి కొత్త ఓటు నమోదు, ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలి అని వివరించారు.

## ఇన్సులిన్ సిరంజీలు అందజేత



నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యులకు ఇన్సులిన్ సిరంజీలు అందిస్తున్న అంబటి

నల్లజర్ల, మార్చి 27: ఎంతో దాతృత్వంలో నల్లజర్ల పీహెచ్‌సీకి అవసరమైన ఇన్సులిన్ సిరంజీలను అందజేసేందుకు దూబచర్లకు చెందిన సంఘమిత్ర విద్యాసంస్థల అధినేత అంబటి శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. బుధవారం నల్లజర్ల సీహెచ్‌సీ వైద్యులకు ఇన్సులిన్ సిరంజీలను ఆయన అందించారు. కుక్కకాటు, పాముకాటుకు గురైన వారు ప్రతిరోజు 10 నుంచి 20 మంది వరకు వస్తుంటారని వారికి వ్యాక్సిన్ అందించేందుకు ఇన్సులిన్ సిరంజీల కొరతవల్ల పలువురి దాతలు ముందుకు వచ్చి అందిస్తున్నారని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. డాక్టర్ గంగధర్, సిరాజ్ ఫుర్వీన్, జీ.వి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీనారాయణస్వామికి విశేష పూజలు



నిడదవోలు, మార్చి 27: మండలంలోని మునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ నారాయణ స్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించా రు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 7 వారాలు 11 ప్రదిక్షణలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## బీజేపీలో నరేష్‌కుమార్ యాదవ్ చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 27 : వైసీపీ నగర యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్ తన అనుచరులతో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దత్తు మాట్లాడుతూ యువకుడైన నరేష్‌కుమార్ యాదవ్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, కురగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● టీడీపీ, జనసేన, బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

● రాష్ట్ర లిక్కర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి



ఉమ్మడి అభ్యర్థి ముప్పిడికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర లిక్కర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరు, మార్చి 27: రాష్ట్ర లిక్కర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవా రం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముప్పిడి వెంకటేశ్వరరావును రాష్ట్ర లిక్కర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు ఎండీ ఇస్మా యిల్‌ఖాన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లిక్కరుషాపులలో పనిచేస్తున్న 72,500మంది కార్మికులను ఒకేసారి విధుల్లోంచి తొలగించిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియమించబడ్డామన్నా ఒకే ఒక్క కక్షతో 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను ఒక్కసారిగా తొలగించడంతో రోడ్డున పడ్డామన్నారు. తెలుగుదేశం పార్టీ తమకు సహకరిస్తే రాష్ట్రవాప్తంగా ఉమ్మడి 13 జిల్లాలో వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం, నిమ్నజాతి వర్గాలకు కేంద్రం చెల్లించే రాయితీలు మళ్లింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జగన్‌రెడ్డి అసమర్థపాలనతో గ్రామాలలో నాటుసారా తాగి సామాన్య ప్రజలు మరణిస్తున్నారన్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలయ్యాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావడం ఎంత అవసరమో ప్రజలకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తామన్నారు. తిగిరిపల్లి గోపి, ముప్పిడి రాజేష్, మడతల అంబేద్కర్, గెడ్డం జగ్జీవన్, వెంకట్రావు, మేక శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ లెక్కింపు

● ఆదాయం రూ.20,77,930

కోరుకొండ, మార్చి27: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణమండపంవద్ద అన్నవరం దేవస్థానం డీసీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలు లెక్కించారు. కొండపైన, కొండ దిగువన హుండీల ద్వారా రూ.11,12,570లు ఆదాయం సమకూరింది. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,37,910లు, లడ్డు ప్రసాదాలు విక్రయాలవల్ల రూ.3,01,100, కల్యాణ టిక్కెట్లు ద్వారా రూ.2,42,172లు, కట్నకానుకల ద్వారా రూ.34,273లు, అన్నదానం విరాళాలు ద్వారా రూ31,905లు, లైసెన్స్ షాపుల ద్వారా, జోళ్లస్టాండ్ రూ.36వేలు, తలనీలాలు ద్వారా రూ.5500లు, కొబ్బరిచెక్కలు పాట ద్వారా రూ.76,500లు, మొత్తం స్వామివారికి రూ.20,77,930లు ఆదాయం సమకూరినట్లు అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

## ఎస్పీకి 'డీజీపీ కమెండేషన్ డిస్క్' పురస్కారం

● జిల్లాలో మరి కొందరికి కూడా..



ఎస్పీ జగదీశ్



హెచ్‌సీ బి.సత్యానందం

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో ప్రతిభ చూపి నందుకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌కి రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారం లభించింది. డీజీపీ కమెండేషన్ డిస్కు-2022 అవార్డులను ప్రక టిస్తూ ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాస్థాయి అధికారుల విభాగంలో తూర్పు ఎస్పీ పి.జగదీశ్, సిబ్బంది విభాగంలో వన్ టౌన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.సత్యానందం సిల్వర్ డిస్కులు కైవసం చేసుకున్నారు. ఎస్పీకి గతేడాది కూడా సిల్వర్ డిస్కు లభించడం గమనార్హం. జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీ డి.శ్రీనివాస రెడ్డి, హెచ్‌సీలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, కె.గోవర్ధన వరప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు ఎల్.ప్రమీల, వి.దీనా కుమారి, కానిస్టేబుల్ డి.దుర్గా ప్రసాద్, ప్రభుత్వ రైల్వే పోలీసు కానిస్టేబుల్ సీహెచ్ గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ విభాగంలో తూర్పుగోదావరి జోన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ ఎం.భాస్కరరావు బ్రాంజ్ డిస్కులకు ఎంపికయ్యారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చాగల్లు, మార్చి 27 : మండలంలోని బ్రాహ్మణగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఇజ్రాయెలు (73) మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయెలు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నిడదవోలు వైపు వెళుతున్న మరొక వ్యక్తి వాహనంను అతివేగంగా నడిపి మంగళవారం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఇజ్రాయెలును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వందేభారత్ ఢీకొని యువకుడి దుర్మరణం

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేశవరం రైల్వే గేటు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వందే భారత్ రైలు ఢీకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు ఎస్‌ఐ మావుళ్లు తెలిపారు. రైలు వచ్చే సమయంలో ట్రాక్ దాటడానికి ప్రయత్నించగా దుర్ఘటన జరిగి ఉండొచ్చన్నారు. మృతుడి నలుపు, ఎర్ర రంగు గళ్లచొక్కా, ఖాకీ రంగు నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.9491003239కి సమాచారం అందించాలని కోరారు.

## సినిమా గైడ్

| | |
|---|---|
| **కొవ్వూరు** | |
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1 | కుంగ్‌పూ పాండా.. |
| వై.స్క్రీన్ 2 | ప్రేమలు |
| దేవిశ్రీ(గాయత్రి) | ఓం బీం బుష్ |
| అనన్య | భీమా |
| **నిడదవోలు** | |
| వీ మ్యాక్స్ | ప్రేమలు |
| రాధాకృష్ణ | భీమా |
| శ్రీగణపతి | ఓం బీం బుష్ |
| **దేవరపల్లి** | |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | గామి |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | భీమా |
| **నల్లజర్ల** | |
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | భీమా |
| స్క్రీన్ 2 | ప్రేమలు |
| శ్రీనివాస | గామి |